# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No:-37ACDFM5465G1Z1





సంపుటి : 14 సంచిక : 351 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ : మహేష్ యాదవ్ 10-12-2025 పేజీలు : 12 వెల రూ.3/




## ఆరు నెలల్లో రాజ్యసభ ఎన్నికలు.. టీడీపీలో మొదలైన పైరవీల పర్వం

ఏపీలో వచ్చే ఏడాది మే-జూన్ నెలల మధ్యలో జరిగే రాజ్యసభ సభ్యుల ఎన్నికపై అప్పుడే వేడి మొదలైంది. మొత్తం నాలుగు స్థానాలు ఖాళీ అవుతాయి. ఈ నాలుగు స్థానాలను టీడీపీ కూటమి పార్టీ గెలుచుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఏపీ నుంచి 11 మంది నేతలు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు టీడీపీ, ఇద్దరు బీజేపీ కాగా, మిగిలిన ఏడుగురు ప్రతిపక్షం వైసీపీ సభ్యులు. వచ్చే ఏడాది జూన్ లో పదవీ విరమణ చేయనున్న సభ్యుల్లో ముగ్గురు వైసీపీ, ఒక టీడీపీ సభ్యుడు ఉన్నారు. వైసీపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీ కాలం వచ్చే ఏడాది జూన్ 21తో పూర్తి కానుంది. అదేవిధంగా గత ఏడాది డిసెంబరులో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ తరఫున గెలిచిన సానా సతీష్ పదవీకాలం కూడా ఆ రోజుతోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో జూన్ కన్నా ముందు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఏదిఏమైనప్పటికీ రాజ్యసభ ఎన్నికలకు ఇంకా ఆరు నెలల సమయం ఉంది. అయితే కూటమిలో ప్రస్తుతం ఉన్న పోటీతో పలువురు నేతలు ఇప్పటి నుంచి రాజ్యసభ రేసును మొదలుపెట్టారని అంటున్నారు. కూటమిలో మూడు పార్టీలు ఉండగా, నాలుగు స్థానాలను ఎలా పంచుకుంటాయనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభకు ఉప ఎన్నికలు జరిగాయి. తొలుత మూడు స్థానాలకు, ఆ తర్వాత ఒక స్థానానికి ఎన్నిక జరిగితే టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు చొప్పున తీసుకున్నాయి. కూటమిలో మరో భాగస్వామి

మిగతా 2లో

## టీటీడీ కల్తీ నెయ్యి కేసు
# నేడు సిట్ కస్టడీకి ఇద్దరు నిందితులు

- ఇద్దరు ప్రధాన నిందితులకు నాలుగు రోజుల కస్టడీ
- అనుమతినిచ్చిన నెల్లూరు ఏసీబీ ప్రత్యేక కోర్టు నిందితులను తిరుపతికి తరలించి విచారించనున్న అధికారులు



తిరుమల కల్తీ నెయ్యి కేసు విచారణలో కీలక ముందడుగు పడింది. ఈ కేసులో అరెస్టయిన ఇద్దరు ప్రధాన నిందితులను నాలుగు రోజుల పాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ నెల్లూరు ఏసీబీ కోర్టు నిన్న ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసు విచారణ మరింత వేగవంతం కానుంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్‌గా (జీఎం) పనిచేసిన సుబ్రహ్మణ్యం, నెయ్యి సరఫరా చేసిన భోలేబాబా డెయిరీ అధికారిక ప్రతినిధి అజయ్ సుగంధిని సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకోనున్నారు. ఈ రోజు (మంగళవారం) వీరిద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి తిరుపతికి తరలించి విచారణ చేయనున్నారు. ఈ కేసులో మరింత కీలక సమాచారం రాబట్టేందుకు వీరి కస్టడీ అవసరమని సిట్ వాదించింది.నిందితుల కస్టడీ పిటిషన్లపై ఈ నెల 3న విచారణ జరిపిన ఏసీబీ కోర్టు, తీర్పును రిజర్వు చేసింది. తాజాగా నిన్న కస్టడీకి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నాలుగు రోజుల విచారణలో కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించిన మరిన్ని ముఖ్యమైన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



## పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో రేపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్

- మంగళగిరిలో 'మాటామంతీ' కార్యక్రమం ఏర్పాటు
- అవినీతి రహిత పాలనపై ఉద్యోగులకు దిశానిర్దేశం
-గ్రామీణ సేవల మెరుగుకు సలహాలు స్వీకరించనున్న పవన్

2



## స్క్రబ్ టైఫస్ కలకలం...

2


ఏపీ ప్రభుత్వం ఏం చెబుతోందంటే...!

ఏపీలో కలవరపెడుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు

ఈ ఏడాది ఇప్పటివరకు 1,566 మందికి వ్యాధి నిర్ధారణ

రాష్ట్రవ్యాప్తంగా 9 అనుమానిత మరణాలు నమోదు

చికిత్స అందుబాటులో ఉందన్న ఆరోగ్యశాఖ జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచన



## ఆయనకు రాజకీయంగా ఒక్క శత్రువు కూడా లేరు: సీఎం బాబు

- డిసెంబర్ 11 నుంచి 25 వరకు 'అటల్ సందేశ్ యాత్ర'
- యాత్రలో పాల్గొనాలని కూటమి ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు పిలుపు
- వాజ్‌పేయిని రాజకీయ భీష్ముడిగా అభివర్ణించిన వైనం
- పోఖ్రాన్ అణుపరీక్షలు, స్వర్ణ చతుర్భుజి ప్రాజెక్టు వాజ్‌పేయి ఘనతలేనని కితాబు
- రాష్ట్ర అభివృద్ధికి వాజ్‌పేయి ఎంతగానో సహకరించారని గుర్తుచేసుకున్న చంద్రబాబు

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించనున్న 'అటల్ సందేశ్-మోదీ సుపరిపాలన' యాత్రను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయే కూటమి నేతలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 11 నుంచి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న ఈ యాత్రలో టీడీపీ, బీజేపీ,

మిగతా 2లో




## 2024 బ్యాచ్: ఏపీకి 8 మంది ఐపీఎస్‌ల కేటాయింపు

- ఏపీకి 8 మంది కొత్త ఐపీఎస్ అధికారుల కేటాయింపు
- కొత్త జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురు అధికారులు

..2లో

## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: లోక్‌సభలో రాహుల్ గాంధీ

2లో

## అనిల్ అంబానీ కుమారుడిపై సీబీఐ కేసు

- అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్‌పై సీబీఐ కేసు
- రూ.228 కోట్ల బ్యాంకింగ్ మోసానికి సంబంధించిన వ్యవహారం
- యూనియన్ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో జై అన్మోల్ అంబానీ




ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ కు సంబంధించిన బ్యాంకింగ్ మోసం కేసులో ఆయనపై ఈ చర్యలు తీసుకున్నారు. అనిల్ అంబానీ కుమారుడిపై క్రిమినల్ కేసు నమోదు కావడం ఇదే మొదటిసారి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ రంగంలోకి దిగింది. ఈ కేసులో జై అన్మోల్‌తో పాటు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, కంపెనీ మాజీ సీఈఓ రవీంద్ర సుధాల్కర్‌లను కూడా నిందితులుగా

మిగతా 2లో

## దోచుకున్న లక్ష కోట్లు రిటర్న్ ఇవ్వండి... జగన్‌కు టీడీపీ నేత సవాల్

- తిరుమలను జగన్ ప్రభుత్వం అవినీతి కేంద్రంగా మార్చేసిందన్న సప్తగిరి ప్రసాద్
- పరకామణి చోరీ కేసులో సీఎంఓ జోక్యంతో సెటిల్‌మెంట్
- రూ. 240 కోట్ల దోపిడీలో పెద్ద నేతల పాత్ర ఉందని ఆరోపణలు
- అవినీతిపై చర్చకు రావాలని జగన్‌కు బహిరంగ సవాల్



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల పుణ్యక్షేత్రాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో అవినీతి కేంద్రంగా మార్చేసిందని తెలుగుదేశం పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. తిరుమల పరకామణిలో జరిగిన డాలర్ల చోరీ వెనుక అసలు సూత్రధారులు వేరే ఉన్నారని, ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్ చేసిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పరకామణిలో డాలర్లు

మిగతా 2లో

## సీఎం రేవంత్ కాన్వాయ్‌కు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై పేలిన జామర్ వాహనం టైర్
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- గతంలోనూ రేవంత్ కాన్వాయ్‌లో ఇలాంటి ఘటనే



2

## పీఆర్, ఆర్డీ ఉద్యోగులతో రేపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ భేటీ

ఏపీ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉద్యోగులతో నేరుగా చర్చించేందుకు సిద్ధమయ్యారు. రేపు (బుధవారం) మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ (పీఆర్), గ్రామీణాభివృద్ధి (ఆర్డీ) శాఖల ఉద్యోగులతో 'మాటామంతీ' కార్యక్రమం నిర్వహించనున్నారు. గ్రామ స్థాయిలో అవినీతికి తావులేని, పారదర్శకమైన పాలన అందించేందుకు ఉద్యోగులంతా సహకరించాలని ఈ సమావేశంలో ఆయన కోరనున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీరాజ్ శాఖలో సుమారు 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, గ్రామీణాభివృద్ధి శాఖలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం పదోన్నతులు, వేతనాల పెంపుతో పాటు ఇతర సంక్షేమ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నూతన సంవత్సర కానుకగా సంక్రాంతి నాటికి ఈ ప్రయోజనాలను వారికి అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ నిర్వహిస్తున్న ఈ సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ భేటీలో అన్ని కేడర్ల ఉద్యోగులతో పవన్ స్వయంగా మాట్లాడి, గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎలాంటి విధానాలు అవలంబించాలనే దానిపై వారి అభిప్రాయాలు, సలహాలు తీసుకోనున్నారు. క్షేత్రస్థాయిలో పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## సీఎం రేవంత్ కాన్వాయ్‌కు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్ 17 వద్ద వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో కాన్వాయ్‌లోని జామర్ వాహనం టైర్ అకస్మాత్తుగా పేలిపోయింది. అయితే, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి, చాకచక్యంగా వాహనాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కాన్వాయ్‌లోని భద్రతా సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు, జామర్ వాహనానికి స్టెప్నీ టైర్‌ను అమర్చి అవసరమైన మరమ్మతులు పూర్తి చేశారు. అనంతరం వాహనం తిరిగి సీఎం కాన్వాయ్‌లో చేరింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

## 2024 బ్యాచ్: ఏపీకి 8 మంది ఐఏఎస్‌ల కేటాయింపు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2024 బ్యాచ్‌కు చెందిన 8 మంది ఐఏఎస్ అధికారులను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (DoPT) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ ద్వారా సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా ఈ బ్యాచ్‌లో మొత్తం 179 మంది ఐఏఎస్‌లుగా ఎంపిక కాగా, వారిలో 8 మందిని ఏపీకి కేటాయించారు. రాష్ట్రంలో పరిపాలనను మరింత వేగవంతం చేసి, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ కొత్త అధికారులు దోహదపడనున్నారు. త్వరలోనే వీరంతా రాష్ట్ర ప్రభుత్వంలో విధుల్లో చేరనున్నారు. ఏపీ క్యాడర్‌కు కేటాయించిన వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నారు. బన్నా వెంకటేశ్, ఏఆర్ పవన్ తేజ (ఆంధ్రప్రదేశ్), కె. ఆదిత్య శర్మ, చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ)లకు ఏపీ క్యాడర్ లభించింది. వీరితో పాటు హరి ఓం పాండియా (రాజస్థాన్), నమ్రతా అగర్వాల్ (హరియాణా), ప్రియ (ఢిల్లీ), సుయష్ కుమార్ (ఉత్తరప్రదేశ్) కూడా ఏపీకి రానున్నారు. అదే సమయంలో, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అధికారులను ఇతర క్యాడర్లకు కేటాయించినట్లు డీవోపీటీ తన లేఖలో స్పష్టం చేసింది. చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డిని ఏజీఎంయూటీ (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్ర పాలిత ప్రాంతాలు) క్యాడర్‌కు, పి.సురేశ్ ను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు.

## ఓటు హక్కు వివాదంలో సోనియా గాంధీకి కోర్టు నోటీసులు



భారత పౌరసత్వం రాకముందే కాంగ్రెస్ పార్టీ మాజీ చీఫ్ సోనియా గాంధీ ఓటు హక్కు పొందారన్న వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సోనియా గాంధీకి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ సెషన్స్ కోర్టు నోటీసులు జారీ చేసింది. సోనియా గాంధీకి ఓటు హక్కు విషయంలో దాఖలైన పిటిషన్ విచారణకు స్వీకరించిన కోర్టు.. వివరణ ఇవ్వాలంటూ తాజాగా సోనియాను ఆదేశించింది. భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే సోనియా గాంధీ ఓటరుగా నమోదు చేసుకున్నారని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టును ఆశ్రయించారు. దీంతో తాజాగా సోనియా గాంధీతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన కోర్టు.. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల 6కు వాయిదా వేసింది. ఇటలీ పౌరురాలైన సోనియా గాంధీ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో వివాహం తర్వాత భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని పొందారు. అంతకుముందే.. అంటే 1980 నాటికే ఢిల్లీ ఓటరు జాబితాలో సోనియా గాంధీ పేరు ఉందని పిటిషనర్, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ఎన్నికల చట్టాల ఉల్లంఘనేనని విమర్శిస్తున్నారు. ఓటు హక్కు కోసం సోనియా గాంధీ నకిలీ పత్రాలు సమర్పించి ఉండొచ్చని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ఆయనకు రాజకీయంగా ఒక్క శత్రువు కూడా లేరు: సీఎం బాబు

మొదటిపేజీ తరువాయి

జనసేన పార్టీలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన ఎన్డీయే ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, యాత్రకు సంబంధించిన పలు సూచనలు చేశారు. వాజ్‌పేయి అందించిన సుపరిపాలన సందేశాన్ని ప్రజల్లోకి, ముఖ్యంగా యువతలోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ యాత్రను నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గాన్ని చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వాజ్‌పేయిని 'రాజకీయ భీష్ముడు'గా అభివర్ణించారు. ఆయన శత జయంతి వేడుకల నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి బలమైన పునాదులు వేశారని, ఆయన అమలు చేసిన విధానాలే దేశాభివృద్ధికి బీజాలు వేశాయని కొనియాడారు. "వాజ్‌పేయికి రాజకీయంగా శత్రువులు లేరు. ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని ఆయన దేశానికి అందించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. వాజ్‌పేయి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించి, తన అవిరళ కృషితో అత్యున్నత స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. తొమ్మిదిసార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికవ్వడమే ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు. కేవలం 18 ఏళ్ల వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న దేశభక్తుడని కొనియాడారు. 1998లో పోఖ్రాన్–2 అణుపరీక్షలు నిర్వహించి ప్రపంచానికి భారతదేశ సత్తాను చాటారని, కార్గిల్ యుద్ధంలో శత్రువులకు దీటైన జవాబు ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. వాజ్‌పేయి హయాంలో చేపట్టిన స్వర్ణ చతుర్భుజి (గోల్డెన్ క్వాడ్రిలేటరల్) రహదారి ప్రాజెక్టు దేశ గతిని మార్చేసిందని చంద్రబాబు అన్నారు. టెలికాం, విమానయాన రంగాల్లో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది కూడా ఆయనేనని తెలిపారు. "ఆయనతో నాకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉంది. రాష్ట్ర అభివృద్ధికి ఆయన ఎంతో సహాయం చేశారు. రాష్ట్రం తరఫున ఏది అడిగినా కాదనే వారు కాదు. ప్రజలకు ఏది ఉపయోగమో అదే చేసేవారు. విధానాల రూపకల్పనలో చాలా వేగంగా నిర్ణయాలు తీసుకునేవారు" అని చంద్రబాబు తన పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎన్టీఆర్, వాజ్‌పేయిలను చూస్తే సుపరిపాలన ఎలా ఉండాలో అర్థమవుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ కూడా ఒక విలక్షణమైన వ్యక్తిత్వమున్న నేత అని, ఆయన ఎప్పుడూ ప్రజలకు మంచి చేయాలనే తపనతో ఉండేవారని అన్నారు. "అప్పుడు అణుపరీక్షలు అయినా, ఇప్పుడు సిందూర్ ఆపరేషన్ అయినా.. నిన్నటి చతుర్భుజి అయినా, నేటి సాగర్‌మాల అయినా.. అన్నీ ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలే" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా 2047 నాటికి దేశాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నారని, యువతకు గొప్ప స్ఫూర్తినిస్తున్నారని ఆయన ప్రశంసించారు.

## రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష... 5.74 లక్షల ఎకరాల రికార్డుల పునఃపరిశీలనకు ఆదేశం

భూ రికార్డుల అప్‌డేషన్, సర్వే ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచన ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన అసైన్డ్ భూములపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 5,74,908 ఎకరాల అసైన్డ్ భూముల వివరాలను క్షుణ్ణంగా పునఃపరిశీలించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం అమరావతిలో రెవెన్యూ శాఖ పనితీరుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సీసీఎల్ఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఫ్రీహోల్డ్ విధానంతో పాటు 22ఏ (బి–ఫారం) రీసర్వే, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాలపై ఈ సమీక్షలో చర్చించారు. ప్రభుత్వ పనితీరులో ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రీవెన్స్‌ల పరిష్కార నివేదికను సీఎం ముందుంచారు. గతేడాది జూన్ 15 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1 వరకు తమ శాఖకు మొత్తం 5,28,217 ఫిర్యాదులు అందాయని, వాటిలో ఇప్పటికే 4,55,189 పరిష్కరించామని అధికారులు సీఎంకు వివరించారు. మరో 73 వేల ఫిర్యాదులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి పాలనా సంస్కరణలు, ఆటోమేషన్ ప్రక్రియల కారణంగా గ్రీవెన్స్‌ల పరిష్కారం గణనీయంగా వేగవంతమైందని అధికారులు పేర్కొన్నారు. భూముల రీసర్వే, 22ఏ జాబితాకు సంబంధించిన పురోగతిని అధికారులు చంద్రబాబుకు వివరించారు. రాష్ట్రంలోని 6,693 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేసి, వివరాలను వెబ్ ల్యాండ్ 2.0 పోర్టల్‌లో నమోదు చేశామని తెలిపారు. రీసర్వేలో పొరపాట్లకు తావులేకుండా రికార్డుల అప్‌డేషన్ ప్రక్రియలు చేపట్టామని, ఇది భూ సంబంధిత సమస్యలను తగ్గించడానికి దోహదపడుతుందని వివరించారు. అదేవిధంగా, 22ఏ జాబితా నుంచి భూములను తొలగించాలని కోరుతూ జూన్ నుంచి ఇప్పటివరకు 6,846 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎక్స్–సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954కు ముందు అసైన్డ్ భూములు పొందిన వారి భూములను నిబంధనల ప్రకారం 22ఏ జాబితా నుంచి మినహాయించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత పెంచేందుకు రాష్ట్రంలో 2.77 కోట్ల కుల ధృవీకరణ పత్రాలను ఆధార్‌తో అనుసంధానిస్తున్నట్లు అధికారులు చెప్పగా, సీఎం అభినందించారు. దీనివల్ల అనర్హులను గుర్తించడం సులభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.10,169 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను సీఎంకు వివరించారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. భూ రికార్డుల విషయంలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. డిజిటల్ ప్రక్రియలను వేగవంతం చేయడం ద్వారా భూ సంబంధిత వివాదాలను తగ్గించి, పేదలకు వారి హక్కులు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనాన్ని, సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ సంస్కరణలు దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## 'ఇండిగో' సంక్షోభంపై స్పందించిన మోదీ.. ఏమన్నారంటే..!

మొదటిపేజీ తరువాయి

ఇండిగో విమానాల రద్దుతో దేశవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. పైలట్లు అందుబాటులో లేక విమానాలు ఆలస్యం కావడం, రద్దు కావడం జరిగిందని అధికారులు చెబుతుండగా.. డీజీసీఏ రూల్స్ వల్లే ఇబ్బంది కలిగిందనే ఆరోపణలు వినిపించాయి. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో పైలట్ల విశ్రాంతికి సంబంధించిన నిబంధనలను డీజీసీఏ సడలించిన విషయం తెలిసిందే. తాజాగా ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. మంగళవారం ఉదయం ఎన్డీయే నేతలతో జరిగిన భేటీలో ఇండిగో విమానాల రద్దు కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రధాని ప్రస్తావించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకొచ్చే నిబంధనలు వ్యవస్థలను మెరుగుపరిచేలా ఉండాలే తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టేలా వుండకూడదని ప్రధాని వ్యాఖ్యానించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మోదీ చెప్పారన్నారు. "నియమ నిబంధనలు మంచివే.. అయితే, అవి వ్యవస్థలను మెరుగుపరచాలి, ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు" అని మోదీ అన్నట్లు రిజిజు తెలిపారు.

## స్క్రబ్ టైఫస్ కలకలం...

ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ ఏడాది రాష్ట్రంలో ఇప్పటివరకు 1,566 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 9 అనుమానిత మరణాలు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది ప్రాణాంతక వ్యాధి కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వైద్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఈ విషయంపై మాట్లాడుతూ, "స్క్రబ్ టైఫస్ అనేది పేడ పురుగు ద్వారా వ్యాపించే బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుంది. ఇది సాధారణంగా ప్రతి సంవత్సరం శీతాకాలంలో కనిపిస్తుంది. వ్యాధిని ముందుగా గుర్తిస్తే యాంటీబయాటిక్స్ ద్వారా సులభంగా నయం చేయవచ్చు. మరణాలకు కేవలం ఈ బ్యాక్టీరియా మాత్రమే కారణం కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చు. దీనిపై జీనోమ్ ల్యాబ్స్ ద్వారా విశ్లేషణ చేయిస్తున్నాం" అని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ల్యాబ్‌లలో పరీక్షలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు.

మరోవైపు, గుంటూరు జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ అనుమానిత లక్షణాలతో నలుగురు మరణించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపారు. మరణాలకు గల కచ్చితమైన కారణాలను విశ్లేషిస్తున్నామని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇతర బాధితులు కోలుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## నెహ్రూ అసలైన విశ్వాస పాత్రుడైతే... సిసలైన విశ్వాస ఘాతకుడు మోదీనే: షర్మిల

- నెహ్రూపై మోదీ వ్యాఖ్యలను ఖండించిన షర్మిల
- మోదీ ఓ అభినవ బ్రిటీషర్ అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పూర్వీకుల పాత్రేమిటని ప్రశ్న
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లు మోదీ మాటలున్నాయని ఎద్దేవా



ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని, ఇది స్వాతంత్ర్య ఉద్యమాన్ని, సమరయోధులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెహ్రూ ఈ దేశానికి అసలైన విశ్వాసపాత్రుడైతే, మోదీ సిసలైన విశ్వాస ఘాతకుడని ఘాటుగా విమర్శించారు. స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్లు జైలు జీవితం గడిపిన నెహ్రూను, అదే స్వాతంత్ర్య ఫలాలతో 12 ఏళ్లుగా అధికారంలో ఉంటూ రాజభోగాలు అనుభవిస్తున్న మోదీ విమర్శించడం సిగ్గుచేటని షర్మిల అన్నారు. ప్రధాని హోదాలో పార్లమెంట్ సాక్షిగా మోదీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, ఆయన మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నేతల పాత్రను ఆమె ప్రశ్నించారు. "స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ పాత తరం నేతలు ఎక్కడున్నారు? మత ఛాందసవాదులు ఎప్పుడైనా 'వందేమాతరం' అన్నారా? ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకానికి సెల్యూట్ చేసిందా? 2002 వరకు ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంపై జాతీయ జెండా ఎందుకు ఎగరలేదు?" అని షర్మిల నిలదీశారు. వివిధ వ్యవస్థలపై బీజేపీ అజమాయిషీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే నెహ్రూను దోషిగా చిత్రీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. 'విభజించు – పాలించు' సిద్ధాంతంతో మోదీ ఓ అభినవ బ్రిటీషర్‌లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. జాతీయ గీతాన్ని, వందేమాతరం స్ఫూర్తిని ఈ దేశంలో నిలబెట్టింది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని షర్మిల స్పష్టం చేశారు.

## ఈసీని అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు: లోక్‌సభలో రాహుల్ గాంధీ

ఎన్నికల కమిషన్ (ఈసీ)ను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మంగళవారం లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని, పక్షపాతంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) తప్పు చేసినా శిక్ష పడకుండా చట్టాలను మార్చారని రాహుల్ విమర్శించారు. ఓట్ల దొంగతనంపై తాము ఎన్నో ఆధారాలు సమర్పించినా ఈసీ నుంచి కనీస స్పందన కరువైందని మండిపడ్డారు. బీజేపీకి అనుకూలంగానే ఎన్నికల షెడ్యూళ్లను ప్రకటిస్తున్నారని, పోలింగ్ ముగిసిన 45 రోజుల తర్వాత సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకని ఆయన ప్రశ్నించారు. హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన ఒక మోడల్‌కు 23 ఓట్లు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఓటర్ల జాబితాలను ఎలా తారుమారు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి రాహుల్ గాంధీ మూడు కీలక ప్రశ్నలు సంధించారు.

1. సీఈసీ స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా?
2. ఎస్ఐఆర్ ప్రక్రియలపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న సమయంలో, ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
3. ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా?... అని ప్రశ్నించారు.

## ఆరు నెలల్లో రాజ్యసభ ఎన్నికలు.. టీడీపీలో మొదలైన పైరవీల పర్వం

మొదటిపేజీ తరువాయి

అయిన జనసేనకు ఇప్పటివరకు రాజ్యసభకు అవకాశం దక్కలేదు. ఈ పరిస్థితుల్లో వచ్చే ఏడాది జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో జనసేనకు ఓ సీటు కేటాయిస్తారా? అనేది ప్రధాన చర్చనీయాంశం అయింది. గతంలోనే జనసేన నేత నాగబాబుకు రాజ్యసభ సీటు ఇస్తారని భావించారు. అయితే బీజేపీ ఒత్తిడితో జనసేన సీటు వదులుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. దీంతో మరో ఆరు నెలల్లో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ బదులుగా జనసేన పార్టీకి చాన్స్ వస్తుందని అంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ మూడు సీట్లు తీసుకుంటుందా? మిత్రపక్షాలకు చెరోసీటు కేటాయించి రెండు సీట్లతోనే సరిపెట్టుకుంటుందా? అనే చర్చ కూడా జరుగుతోంది. టీడీపీకి ఎన్ని సీట్లు వచ్చినప్పటికీ ఆ పార్టీలో రాజ్యసభ సీటు కోసం చాలా పెద్ద పోటీనే కనిపిస్తోందని అంటున్నారు. గత ఏడాది ఎన్నికైన సానా సతీష్ కేవలం ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యువల్ చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. మంత్రి లోకేశ్ కు అత్యంత సన్నిహితుడిగా సానా సతీష్ గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో కేంద్ర పెద్దల వద్ద ఆయనకు మంచి పరపతి ఉందని అంటున్నారు. దీంతో కేంద్రంతో లాబీయింగ్ కోసం సానా సతీష్ సేవలను వినియోగించుకుంటారని అంటున్నారు. గతంలో ఈ పనిని సీనియర్ నేత కంభంపాటి రామ్మోహనరావు చేసేవారు. ఆయన కూడా ఇప్పుడు రాజ్యసభ ఆశిస్తున్నారు. అదేవిధంగా గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండిపోయిన గల్లా జయదేవ్, పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ, జవహర్ తోపాటు సీనియర్ నేత వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు తదితరులు కూడా రాజ్యసభ బెర్తును ఆశిస్తున్నట్లు చెబుతున్నారు. ముఖ్యంగా ఉప ఉపముఖ్యమంత్రి పవన్ కోసం సీటు వదులుకున్న పిఠాపురం వర్మకు ఏదైనా ప్రత్యామ్నాయం చూపాలనే డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. అయితే వర్మతోపాటు సీటు ఆశిస్తున్న వారిలో ఎక్కువ మంది అగ్రవర్ణాల వారే ఉన్నారని, సామాజిక సమతుల్యం కోసం బీసీ, ఎస్సీ నేతలకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదనను కూడా తెరపైకి తెస్తున్నారు. దీంతో టీడీపీలో రాజ్యసభ రేసు తీవ్ర ఉత్కంఠ రేపుతోందని అంటున్నారు.

## ఇండిగోపై కఠిన చర్యలు తప్పవు...

- ఇప్పటికే ప్రయాణికులకు రూ.750 కోట్లకు పైగా రిఫండ్
- రోజువారీ సర్వీసుల్లో 5 శాతం కోత విధించిన డీజీసీఏ
- మంత్రి ప్రకటన తర్వాత సభ నుంచి విపక్షాల వాకౌట్

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని, అయితే ప్రణాళికా లోపాల కారణంగా ప్రయాణికులకు కలిగించిన తీవ్ర ఇబ్బందులకు సంస్థను బాధ్యుల్ని చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలు పాటించని ఏ ఎయిర్‌లైన్స్ సంస్థను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సంక్షోభం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఇండిగోకు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, దీనిపై సమగ్ర విచారణ జరుగుతోందని మంత్రి తెలిపారు. నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు ఇండిగో తన రోజువారీ సర్వీసుల్లో 5 శాతం కోత విధించాలని డీజీసీఏ ఆదేశించింది. షెడ్యూళ్లను సమర్థంగా నిర్వహించడంలో ఇండిగో విఫలమైందని డీజీసీఏ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ప్రయాణికులకు రూ.750 కోట్లకు పైగా రిఫండ్ చేసినట్లు ఇండిగో తెలిపిందని రామ్మోహన్ నాయుడు సభకు వివరించారు. ఈ నెల 5 నుంచి 15 వరకు రద్దయిన విమానాల రిఫండ్లు, బ్యాగేజీ సమస్యలు మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రయాణికులను ఆదుకోవడానికి విమాన టికెట్ల ధరలపై పరిమితులు విధించిందని, ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా రీబుకింగ్‌లు చేశారని తెలిపారు. పైలట్లు, సిబ్బంది రోస్టరింగ్ నిబంధనల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. మంత్రి ప్రకటన అనంతరం కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. దేశంలో పటిష్ఠమైన, ప్రయాణికులే ప్రథమ ప్రాధాన్యతగా ఉండే విమానయాన రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు.

## అనిల్ అంబానీ కుమారుడిపై సీబీఐ కేసు

మొదటిపేజీ తరువాయి

చేర్చారు. చీటింగ్, నేరపూరిత కుట్ర, నిధుల దుర్వినియోగం ద్వారా బ్యాంకుకు రూ.228.06 కోట్ల నష్టం కలిగించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సీబీఐకి అందిన ఫిర్యాదు ప్రకారం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ వ్యాపార అవసరాల కోసం బ్యాంకు నుంచి రూ.450 కోట్ల వరకు రుణ సదుపాయం పొందింది. అయితే, కంపెనీ సకాలంలో వాయిదాలు చెల్లించడంలో విఫలమవడంతో 2019 సెప్టెంబర్ 30న ఈ ఖాతాను నిరర్థక ఆస్తిగా (NPA) వర్గీకరించారు. అనంతరం గ్రాంట్ థార్న్‌టన్ సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో కంపెనీ రుణాలుగా పొందిన నిధులను ఇతర అవసరాలకు దారి మళ్లించినట్లు తేలింది. ప్రమోటర్లు, డైరెక్టర్ల హోదాలో ఉన్న నిందితులు ఖాతాలను తారుమారు చేసి, నిధులను పక్కదారి పట్టించి బ్యాంకును మోసం చేశారని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఫిర్యాదులో ఆరోపించింది. ఈ కేసులో భాగంగా సీబీఐ అధికారులు కంపెనీకి సంబంధించిన పత్రాలు, లోన్ అకౌంట్లను పరిశీలించనున్నారు.

## దోచుకున్న లక్ష కోట్లు రిటర్న్ ఇవ్వండి... జగన్‌కు టీడీపీ నేత సవాల్

మొదటిపేజీ తరువాయి

దొంగతనం చేస్తూ పట్టుబడిన రవికుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా, సీఎంఓ జోక్యంతో రాజీ కుదిర్చారని సప్తగిరి ఆరోపించారు. సుమారు రూ. 240 కోట్ల విలువైన సొమ్మును కాజేసిన ఈ కేసులో కేవలం రూ. 14 కోట్లను గిఫ్ట్ రూపంలో రాయించుకుని కేసును నీరుగార్చారని విమర్శించారు. మిగిలిన వందల కోట్ల రూపాయలను వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డి పంచుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ గిఫ్ట్ డీడ్‌పై కేవలం ఛైర్మన్ ఒక్కరే సంతకం చేయడంపై హైకోర్టు కూడా అప్పట్లో ప్రశ్నించిందని గుర్తుచేశారు. తిరుమల కల్తీ నెయ్యి కుంభకోణంపై సుప్రీంకోర్టు ఆదేశాలతో సిట్ విచారణ జరుగుతోందని, ఈ కేసులో జగన్ సొంత బాబాయి వైవీ సుబ్బారెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారని సప్తగిరి ఆరోపించారు. పెద్ద తలలను కాపాడేందుకు చిన్న ఉద్యోగులను బలిపశువులను చేశారని విమర్శించారు. లడ్డూ ప్రసాదం తయారీ నుంచి ఇంజనీరింగ్ పనుల వరకు ప్రతీ దాంట్లోనూ అవినీతి జరిగిందన్నారు. గరుడ వారధి నిర్మాణంలో అవినీతి జరిగిందంటూ జగన్ చేసిన విమర్శలను సప్తగిరి ప్రసాద్ తిప్పికొట్టారు. చంద్రబాబు హయాంలో 80 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టుపై, ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లను బెదిరించి ఎన్నికల నిధులు వసూలు చేయలేదని వెంకటేశ్వర స్వామిపై ప్రమాణం చేయగలరా అని జగన్, వైవీ సుబ్బారెడ్డి, భూమనలకు సవాల్ విసిరారు. రవికుమార్ పశ్చాత్తాపంతో డబ్బు తిరిగి ఇచ్చినట్లు, జగన్ కూడా దోచుకున్న లక్ష కోట్లు ప్రజలకు తిరిగిస్తే పుణ్యం దక్కుతుందని ఎద్దేవా చేశారు.

# ఘనంగా వైఎస్ భారతమ్మ జన్మదిన వేడుకలు



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ జన్మదిన వేడుకలను కర్నూలు నగరంలోని కల్లూరు అర్బన్, గణేష్ నగర్‌లో ఉన్న మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ బి.వై.రామయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి వైఎస్ భారతమ్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, ఎస్వీ విజయమనోహరి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్‌ఆర్సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికకు 30 లక్షల మంజూరు చేసిన ఎమ్మెల్యే బుడ్డా



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 9 :** బండిఆత్మకూరు మండల పరిధిలో ఉన్న నారాయణపురం గ్రామంలో హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు గాను సూచనలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. హిందూ స్మశాన వాటిక తో పాటు వంతెన రహదారి నిర్మాణ పనులకు గాను ఈ నిధులను మంజూరు చేశారు. హిందూ స్మశాన వాటికకు వెళ్లే ప్రధాన మార్గంలో ప్రధాన కాలు అడ్డు ఉండటం వల్ల స్మశాన వాటికకు వెళ్లేందుకు గ్రామస్తులు ఏళ్ల తరబడి నుండి ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు నెలకొని ఉండేది. 2024 సంవత్సరం లో ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి స్మశాన సమస్యను తెలుగుదేశం పార్టీ నాయకులు కంప మల్ల వెంకటసుబ్బయ్య బ్రాహ్మణ చెరువు నీటి సంఘం అధ్యక్షులు పాలశంకర్ ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం హిందూ స్మశాన వాటిక వంతెనతో పాటు రహదారి పనుల నిర్మాణానికి గాను 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం స్మశాన వాటిక పనులను నిర్మించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

# వృద్ధురాలని కాపాడి మానవత్వంను చాటుకున్న కానిస్టేబుల్ ప్రసాద్

## మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించిన వెలుగోడు హెడ్ కానిస్టేబుల్ కానిస్టేబుల్ ప్రసాద్

**పల్లె వెలుగు వెలుగోడు**



మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ వృద్ధురాలని కానిస్టేబుల్ ప్రసాద్ కాపాడిన ఘటన కాపాడిన ఘటన వెలుగోడులో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే బండి ఆత్మకూరు మండలం ఎరుకల కాలనీకి చెందిన వృద్ధురాలు మతిస్థిమితం కారణంగా తిరుగుతూ వెలుగోడుకు చేరుకుంది. సోమవారం రాత్రి రాత్రి వెలుగోడు లోని వీధులలో తిరుగుతున్న వృద్ధురాలిని గమనించిన కానిస్టేబుల్ ఆమెను తీసుకెళ్లి వృద్ధాశ్రమంలో చేర్పించారు. రాత్రంతా వృద్ధాశ్రమంలో ఉంచి తిరిగి మంగళవారం ఉదయం బండి ఆత్మకూరులోని వృద్ధురాలి నివాసం వద్దకు తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు కానిస్టేబుల్ ప్రసాద్ అప్పగించారు. కుటుంబ సభ్యులు కానిస్టేబుల్ ప్రసాద్ కు వృద్ధాశ్రమం నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. మరోసారి మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ ప్రసాద్ ను సహకార సిబ్బంది అభినందించారు.

# హెల్మెట్ ధరించండి.. క్షేమంగా ఇంటికి చేరండి

## రాజ్ విహార్ సెంటర్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కర్నూలు జిల్లా ట్రాఫిక్ పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ (%శ్రూా%) ఆదేశాల మేరకు, డీఎస్పీ బాబు ప్రసాద్ పర్యవేక్షణలో మంగళవారం స్థానిక రాజ్ విహార్ సెంటర్లో ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో 'హెల్మెట్ స్పెషల్ డ్రైవ్' మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను ఆపి హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు ఈ-చలానాల ద్వారా జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, తద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా కుటుంబానికి అండగా ఉండాలని పోలీసులు కోరారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కూరగాయల ధరల నియంత్రణకు సమన్వయ చర్యలు

## జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

నంద్యాల జిల్లా లో కూరగాయల ధరలను నియంత్రించి వినియోగదారులకు న్యాయమైన ధరలు అందించేందుకు అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వెజిటబుల్ ప్రైస్ మానిటరింగ్ సమావేశంలో రైతులు, హెూల్సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారులు, హార్టికల్చర్ అధికారులు, రైతు బజార్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ ప్రసాద్ మాట్లాడుతూ, కూరగాయల సరఫరా మరియు డిమాండ్‌ను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, ధరలు అదుపు తప్పకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు నష్టం లేకుండా, వినియోగదారులపై భారం పడకుండా ధరల నియంత్రణకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.సమావేశంలో కూరగాయల ధరల్లో తేడాలు, సరఫరా వ్యవస్థ, రైతు బజార్ల నిర్వహణపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ ప్రసాద్. జాకీర్ తో సంబంధిత అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# జమాఆతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మెటర్నిటి వార్డులో పండ్లు పంపిణీ..

## షుగర్ తో కాలు కోల్పోయిన మహెబుబ్ బాషాకు 12,000/- వితరణ



**పల్లె వెలుగు నంద్యాల**

నంద్యాల జమాఆతె ఇస్లామీ హింద్, మహిళా విభాగం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలోని మెటర్నిటి వార్డులో 101 మంది బాలింత, తదితర వ్యక్తులు మహిళలకు ఏడు వేల రూపాయలు విలువగల పండ్లు పంపిణీ చేసారు. మహిళా విభాగం నాజిమా శ్రీమతి బేగం అమ్తుస్సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫిర్దోష్ యూనూస్, షీమా బాను, రబ్బికా, అఫ్సానా,షాహీన్, నాజియా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు. పొరుగు వారి హక్కుల ఉద్యమంలో భాగంగా ఆసుపత్రిలో మతాలకు అతీతంగా రోగులను సందర్శించుటకు జేఐహెచ్ అధ్యక్షులు అబ్దుల్ సమద్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అమ్తుస్సలాం తెలిపారు. తద్వారా దైవచింతన, పరోపకారం, పరస్పర సహకారాలు ఆస్వాదించినట్లు తెలిపారు.

**మహబూబ్ బాషా కు ఆర్థిక సహాయం:**

మహిళా విభాగం ఆధ్వర్యంలో నడిగడ్డా వీధిలో కే. కే. ఫంక్షన్ హాల్ వద్ద షుగర్ వ్యాధి వల్ల కాలు తీసివేసిన మహబూబ్ భాషా కు పరామర్శించి, పేదరికంలో ఉన్న ఆయన శ్రీమతికి ధైర్యం చెప్పి రు. 12,000/- ఆర్థిక సహాయం అందించి నట్లు మహిళా విభాగం నాజిమా శ్రీమతి అమ్తుసలాం తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు ముహమ్మద్ ఫయాజ్, యూనూస్, నబీరసూల్ పాల్గొన్నారు. మహిళా విభాగం సేవలకు జమాత్ అధ్యక్షులు అబ్దుల్ సమద్ అభినందించారు.

# విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి కాదా? అని ప్రశ్నించిన ఎస్ డి పి ఐ (ఎస్ డి పి ఐ) అసెంబ్లీ నాయకులు



**పల్లె వెలుగు నంద్యాల రూరల్**

మాజీ ప్రధాని వాజపేయి విగ్రహ ఏర్పాటుకు మేము వ్యతిరేకం కాదు కానీ ట్రాఫిక్ కు అంతరాయం కలిగే చోట విగ్రహం పెట్టడానికి అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారు ఎస్ డి పి ఐ నాయకులు తెలిపారు.కూటమి ప్రభుత్వంలో మేము భాగస్వామ్యం కాబట్టి మా నాయకుల విగ్రహము పెడతాము దీనికి ఎవ్వరు అనుమతి అవసరం లేదని అనుకుంటున్నారా? రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం పెట్టడానికి సర్కిల్ దొరక్క మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో పెట్టడానికి కూడా సంవత్సరాలు చేసిన అధికారులు, నాయకులు కేవలం రెండు మూడు రోజుల్లోనే కొత్త విగ్రహాలకు ఎలా అనుమతులు ఇచ్చారు? నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు వి హనీఫ్ పత్రికా సమావేశంలో నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా మాజీ ప్రధాని వాజ్పేయి విగ్రహం ఏర్పాటును కేవలం రెండు మూడు రోజుల్లోనే మున్సిపల్ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయన విగ్రహం ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని కానీ అత్యంత రద్దీగా ఉండే చోట ముఖ్యంగా హాస్పిటల్ కి వచ్చే పేషెంట్లు అంబులెన్సులకే అక్కడ దారి సరిగ్గా సరిపోదు, అటువంటి చోట విగ్రహం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్కు మరియు పేషెంట్లకు తీవ్ర ఇబ్బందు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. గతంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహము ప్రధాన కూడల్లో స్థలం లేక ఏర్పాటు చేయలేమని చెప్పిన అధికారులు మరియు నాయకులు సంవత్సరాలు వేచి ఉన్న తర్వాత ఆయన విగ్రహాన్ని మున్సిపల్ ఆవరణలో సంవత్సరాలనుంచి ఏర్పాటు చేయలేకపోతున్నారని కానీ కేవలం రెండు మూడు రోజుల్లోనే విగ్రహానికి ఎలా అనుమతులు ఇచ్చి పనులు చేపించారని అధికారులను విమర్శించారు. ఒకవేళ అధికారుల అనుమతి లేకుండా కూటమిలో మేము భాగస్వాములము మమ్మల్ని ఎవడు అడుగుతారని భావించి అక్కడ విగ్రహం వారంతకు వారే ఏర్పాటు చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మజీద్ ఖాన్ కమిటీ సభ్యులు అక్తర్ హుస్సేన్ పాల్గొన్నారు.

# ఆదోని జిల్లా సాధనకై కదలిరండి

## ప్రజల న్యాయమైన డిమాండ్ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

## విద్యార్థి జేఏసీ పిలుపు మేరకు ఆదోని బందును విజయవంతం చేయాలి




**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 9**

రండి కదలిరండి కలిసి రండి మనమందరం ఒక్కటై ఆదోని జిల్లా కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం. ఆదోని జిల్లా సాధన సమితి విద్యార్థి జేఏసీ పిలుపు మేరకు 10-12-2025 తేదీన నిర్వహించే ఆదోని బంద్‌ను విజయవంతం చేయాలని వినమ్రంగా కోరుతున్నాం.జిల్లా హక్కు కోసం అభివృద్ధి కోసం ప్రజల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేసి ఆదోనిన జిల్లా కేంద్రంగా ప్రకటించాలి.ఆ లక్ష్యం సాధించే వరకు మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది.ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని ఆదోని బంద్‌ను ఘనవిజయం చేయండి.

# పశ్చిమ ప్రాంతం అభివృద్ధి కావాలంటే " ఆదోని జిల్లా కావాలి "

- ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్
- ఆదోనిలో జెపిసి అధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంలో పాల్గొన్న పెద్దకడుబూరు రాజకీయ పార్టీ నేతలు
- టిడిపి రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి నరవరమాకాంత రెడ్డి...
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ రాజు...



( పల్లె వెలుగు న్యూస్ ) పెద్దకడుబూరు మండలం డిసెంబర్ 09 :- పశ్చిమ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని టిడిపి రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి నరవరమాకాంత రెడ్డి మరియు పెద్దకడబూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆనంద్ రాజు లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోని పట్టణం లో జెపిసి అధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో వారు పాల్గొనడం జరిగింది... ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతమైన ఆదోని పట్టణం అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడి ఉందని, అలాగే చుట్టూ ప్రక్కల ఉన్న మండలాలు, గ్రామాల ప్రజలు వారి అవసరాల పరిష్కారం కొరకు ప్రస్తుత జిల్లా కేంద్రమైన కర్నూలు కు వెళ్ళడానికి అనేక అవస్థలు ఎదురుకుంటున్నారని వారు అన్నారు. అంతేకాకుండా ఆదోని పట్టణాభివృద్ధికి ఆదోనిని ప్రత్యేక జిల్లా చేయడమే ఏకైక మార్గమని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# ఆదోని బంద్‌కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు

### ఆదోని జిల్లా సాధన బందుకు తరలి రండి ఉమాపతి నాయుడు



**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 9**

ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఆదోని జిల్లా సాధన సమితి (జేఏసీ) పిలుపునిచ్చిన రేపటి బంద్‌కు తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ?ఈరోజు ఆదోని సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు కార్యాలయంలో జేఏసీ నాయకులు వారిని కలిసి, రేపటి బంద్‌లో మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు ఆదోని నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొంక మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఉమాపతి నాయుడు సానుకూలంగా స్పందించారు.?ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఆదోని జిల్లా సాధన ఆకాంక్షకు మా తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుంది. మా నాయకులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, రేపు జరగబోయే ఆదోని బంద్‌కు మా పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం. మా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ బంద్‌ను విజయవంతం చేస్తారు అని హామీ ఇచ్చారు.?రండి కదలి రండి ఆదోని జిల్లా సాధనలో భాగస్వాములకండి!

# అంగనవాడీ కేంద్రాల్లో తనిఖీలు



**మహానంది, పల్లె వెలుగు**

మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరుశాతం, వంటగది, పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న మెనూను ఆమె పరిశీలించారు.మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా.. బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం అందిస్తున్నారా అన్న విషయాలపై ఆరా తీశారు. విద్యాబోధనపై పలు అంశాలను చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత పాల్గొన్నారు.

# నకిలీ మందులను అరికట్టాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

నకిలీ మందుల ను అరికట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ నుండి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కర్నూలు , విశాఖపట్నం రీజనల్ లేబరేటరీలను మరియు 9 డిప్యూటీ డైరెక్టర్ మరియు ఏడి కార్యాలయాలను వర్చువల్ గా ప్రారంబించారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ నూతన భవనాలను, లేబరేటరీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వీటి ద్వారా మందులను పరీక్షించి, అనవసర మందులు, నకిలీ మందులు నియంత్రించబడి, ప్రజలకు మంచి ఆరోగ్య సేవలు అందుతాయని తెలియజేశారు. కర్నూలులో స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి సమీపంలో నూతనంగా రూ.2.78 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన డిప్యూటీ డైరెక్టర్, డ్రగ్స్ కంట్రోల్ మరియు రీజనల్ లేబరేటరీ భవనాలను ఫిజికల్ గా జిల్లా కలెక్టర్, పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఔషధ దుకాణాల యజమానులతో మాట్లాడుతూ... ఔషధ దుకాణాలలో నకిలీ మందులను, కాలం చెల్లిన మందులను అమ్మ రాదన్నారు..ప్రజలు యాంటీ బయాటిక్స్ ను అధిక మోతాదులో, వారి ఇష్టానుసారం దుకాణాల నుండి కొని వాడుతున్నారని, వీటిని అధిక మోతాదులో వాడడం వల్ల రోగనిరోధక శక్తి క్షీణించి, ఇతర రోగాల బారిన పడి చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని కలెక్టర్ తెలిపారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేనిదే వాటిని అమ్మరాదని కలెక్టర్ దుకాణాల యజమానులను కోరారు. వైద్యులు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ల ద్వారానే మందులనే ప్రజలకు అందించాలని కోరారు. మరి కొద్ది రోజుల్లో ఈ లేబరేటరీకి ఇంకా అత్యాధునిక పరికరాలు వస్తాయని తెలిపారు. ఇక్కడకు అన్ని జిల్లాల నుండి వచ్చే మందులను పరీక్షించి, నకిలీ మందులు, కాలం చెల్లిన మందు ల వివరాలు ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పాణ్యం శాసనస భ్యులు గౌరు చరిత మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాల కృషి చేస్తూ ఉన్నదని, అందులో భాగంగా పేద ప్రజలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చు అయ్యే వైద్యం ను ఉచితముగా అందిస్తూ ఉందని తెలిపారు.. ప్రస్తుతం ప్రజలు ప్రతి అనారోగ్య సమస్యకు మందులు వాడుతున్నారని, దానిని తగ్గించుకోవాలని , ప్రకృతి పరంగా జబ్బును నయం చేసుకోవడం మంచిదని తెలిపారు. విదేశాలలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు కొనే అవకాశమే లేదని కానీ మన దగ్గర విచ్చలవిడిగా మందులు కొని వాడుతున్నారని దీనిని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఔషధ దుకాణాల యజమానులను కోరారు. లాబరేటరీ ని ప్రారంభించిన అనంతరం పరికరాలను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. అవి ఏ విధంగా వినియోగిస్తారు , వాటి వల్ల ఉపయోగాలను టెక్నిషియన్లు , అధికారులు వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిఎంహెచ్వో భాస్కర్ , డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా , డిప్యూటీ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ నాగ కిరణ్ కుమార్ , అసిస్టెంట్ డైరెక్టర్ హరిహర తేజ , డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న , సిబ్బంది మరియు ఔషధ దుకాణ యజమానులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చేశారు

- హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- మేం చేసిన పనులకే నేడు కొబ్బరికాయలు కొడుతున్నారు
- 'యువత మేలుకో' సదస్సులో కాటసాని రాంభూపాల్ రెడ్డి ధ్వజం



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ పేరుతో అబద్ధపు హామీలిచ్చి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్నూలు నగరంలోని హ్యాంగౌట్ హెూటల్ కేఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన "యువత మేలుకో" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నా నిరుద్యోగులకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 5 వేల మందికి పైగా నిరుద్యోగ యువత ఉన్నారని, వారికి ఎటువంటి నిరుద్యోగ భృతి ఇవ్వని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థను ఎన్నికల ముందు వాడుకుని, అధికారంలోకి వస్తే రూ. 10 వేలు ఇస్తామని నమ్మబలికి, తీరా గెలిచాక వారిని తొలగించి మోసం చేశారని విమర్శించారు.

**రైతు కంట కన్నీరు..**

రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఉల్లి, మామిడి, వేరుశెనగ వంటి పంటలకు గిట్టుబాటు ధర లేక రోడ్లపై పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం మొక్కజొన్నను క్వింటాల్‌కు రూ. 2300 ఇచ్చి కొనే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వంలో లేదన్నారు. రైతుల బాగోగులు గాలికి వదిలేసి, గ్రామగ్రామాన బెల్టు షాపులను ఏర్పాటు చేశారని, ఇప్పుడు మందు తాగేవాళ్లు సైతం ప్రభుత్వాన్ని తిట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు.

**అభివృద్ధి చేసింది మేము..**

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఏ రైతుకు అన్యాయం జరగకుండా అధికారులు, మంత్రులతో మాట్లాడి ప్రత్యేక చొరవతో అభివృద్ధి చేశానని కాటసాని గుర్తు చేశారు. నన్నూరు నుంచి నాగలాపురం వరకు, హుసేనాపురం నుంచి గడివేముల వరకు రోడ్లు వేయించామని, ఇప్పుడు తాము చేసిన పనులకే కూటమి నేతలు సిగ్గులేకుండా భూమి పూజలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 42 వేల మెజారిటీతో గెలిచిన తనపై విమర్శలు చేసే అర్హత కూటమి నాయకులకు లేదని, దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో కర్నూలు నగర మేయర్ బి.వై. రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు, కర్నూలు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి యువజన విభాగం అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

### అంగన్వాడీలకు నెలకు 26 వేల కు వేతనం పెంచాలని 12వ తేదీ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి సిఐటియు



**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 9**

ఆదోని ప్రాజెక్టు అంగనవాడేల విస్తృత సమావేశం వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అంగనవాడి జిల్లాగౌరవ అధ్యక్షురాలు పి నిర్మల, ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ. సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు. గోపాల్,తిప్పన్న,రామాంజనేయులు వీరారెడ్డి, వీరు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలను అమలు చేసే,వేతనం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ అలాగే అంగన్వాడీలకు స్థానిక నాయకులు,అధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని వీటిని మానుకోవాలని అన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కనీస వేతనం నెల 26 వేల రూపాయలు పెంచాలని తదితర సమస్యల పరిష్కరించాలని ఈ నెల 12వ తేదీ కలెక్టరేట్ ముట్టడిని అంగన్వాడీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.విశాఖలో జరుగు. ఆల్ ఇండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి గోడ పత్రికలు కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు సరోజ పద్మ,గీతా సోమక్క రేణుక లక్ష్మీదేవి, కరుణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు



**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 9:** తల్లి బిడ్డల మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి సురక్షిత అభియాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ప్రతి గర్భిణీ స్త్రీకి ప్రతినెలా తొమ్మిదవ తేదీన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా సమగ్రంగా నాణ్యమైన ప్రసవ పూర్వ సంరక్షణ సేవలను అందించాల్సి ఉంటుంది. ఈ పథకంలో భాగంగా మంగళవారం బండి ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 45 మంది గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. బ్లడ్ ప్రెషర్ రక్త పరీక్షలు షుగర్ లాంటి పరీక్షలను నిర్వహించారు. పౌష్టిక ఆహారం గురించి మహిళలకు వివరించారు. గర్భిణీ స్త్రీలు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉంటే అటువంటి వారిని గుర్తించి తగు సూచనలు చేసి, వారు మరింత వైద్య సేవలు పొందేందుకుగాను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సవిత పబ్లిక్ హెల్త్ నర్స్ లక్ష్మీదేవి తోపాటు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి

### మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి..




**మహానంది, పల్లె వెలుగు**

రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి, వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రైతులు విచక్షణారహితంగా యూరియా ఎరువులు వాడరాదన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా వాడుట ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా నేల, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు అన్నారు. కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. వరిలో పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు, గంధకము కలిగి ఉన్న ఎరువులను వాడరాదన్నారు. దుక్కిలో భాస్వరం, పొటాష్ ఎరువులు ఖచ్చితముగా వాడాలని సూచించారు. జీవన, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మాధవ్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన అధికారులు మంజుల, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

### సైబర్ క్రైమ్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, శక్తి యాప్ లపై అవగాహన కార్యక్రమాలు

### అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా.

### స్కూల్లు/కాలేజీలు వద్ద, అనుమానాస్పద ప్రదేశాలలో పట్టణ శివారు ప్రాంతాల్లో ఆధునిక పరిజ్ఞానంతో నిఘా కట్టుదిట్టం



**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీస్ అధికారులు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా స్కూళ్లు కాలేజీలు, అనుమానాస్పద ప్రాంతాలు, పట్టణ శివారు కేంద్రాలలో, నేరాలు జరుగుటకు అవకాశం ఉన్న ప్రాంతాలలో పోలీసుల కదలికలు సస్పష్టంగా కనిపించేలా మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ కెమెరాలతో నిఘా చేపట్టేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించవచ్చునని లక్ష్యంతో ఈ విజిబుల్ పోల్ సింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ద్వారాపోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడంతో పాటు రోడ్డు ప్రమాదాలు సైబర్ సైబర్ నేరాలు చిన్నారులపై జరిగే అఘాయిత్యాలు, ఈవ్ టీజింగ్, శక్తి యాప్ మొదలగు వాటిపై పోలీసు అధికారులు విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోవద్దని సూచిస్తున్నారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేస్తున్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా మోటర్ వెహికల్ యాక్ట్ ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడం జరుగుతుంది. విజిబుల్ పోలీసింగ్ ద్వారా పోలీసులు ప్రజల మధ్య ఉంటూ వారికి రక్షణ కల్పిస్తున్నారు. ప్రజలు భద్రతకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# సింగిల్ డెస్క్ దరఖాస్తులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

### పెండింగ్‌లో ఉన్న 52 దరఖాస్తులను వేగంగా పరిష్కరించండి

### పిఎంఈజిపి లక్ష్యాలను అధిగమించాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**

సింగిల్ డెస్క్ ద్వారా అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను నిర్ణీత గడువులోపే పరిష్కరించి, నూతన పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ ( డి ఐ ఈ పి సి) సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, ఎల్డిఎమ్ రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విధానంలో పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను అవసరమైన అన్ని పత్రాలు అర్జీదారుల నుంచే తెప్పించుకొని, తిరిగి పంపకుండా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఆర్. కృష్ణాపురంలోని హస్తకళల స్టోన్ మర్చెంట్లను మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి కోసం 4 కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉందని, వాటికి తగిన స్థలాలను గుర్తించి సంబంధిత యాజమాన్యాలతో




చర్చించి, వివరాలను ఇన్వెస్ట్మెంట్ ట్రాకర్‌లో అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. పి ఎం ఈ జి పి కింద కేటాయించిన 137 లక్ష్యాల్లో కేవలం 59 మాత్రమే పూర్తి అయినందున, మిగిలిన వాటిని ప్రాధాన్యంతో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన వారికి బ్యాంకులు ఆర్థిక సహాయం అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలి అని బ్యాంకర్లను కోరారు. గత త్రైమాసికంలో మొత్తం 1,025 పరిశ్రమల దరఖాస్తులు అందగా, వాటిలో 973 దరఖాస్తులకు అనుమతులు మంజూరు అయ్యాయని, ఇంకా 52 దరఖాస్తులు వివిధ శాఖల్లో పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ఫ్యాక్టరీలు తదితర శాఖలు గడువులోపే అనుమతి ప్రక్రియ పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కింద పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ, విద్యుత్ చార్జీ సబ్సిడీ, సేల్స్ ట్యాక్స్ రాయితీలు వంటి పథకాల ద్వారా జిల్లాలో 9 యూనిట్లకు రూ. 35.41 లక్షల విలువైన రాయితీ ప్రయోజనాలను కమిటీ ఆమోదించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

**యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి**

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో నిర్ణీత లక్ష్యాలను అధిగమించి జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు, యువతి-యువకుల నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.

# హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తాం

### రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత



**పల్లె వెలుగు సచివాలయం**

జర్నలిస్టులపై దాడుల నివారణకు వీలుగా రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీని వీలైనంత త్వరలో నియామకం చేస్తామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధి వర్గానికి హామీ ఇచ్చారు. సచివాలయంలో డిసెంబర్ 9వ తేదీ హోం మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గం జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు రాష్ట్రస్థాయిలో హైపర్ కమిటీ, జిల్లా స్థాయిలో దాడుల నివారణ కమిటీలను నియమించాలని అందుకు వీలుగా ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే కమిటీ నియామకంపై తగిన చర్యలు తీసుకోవాలని ఓ ఎస్ డి అనిల్ కుమార్ కి ఆదేశం ఇచ్చారు. మంత్రిని కలిసిన ఫెడరేషన్ ప్రతినిధి వర్గంలో ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు తో పాటుగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కలిమి శ్రీ,, ఎంబీనాథన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు ఆనంద్, చిన్న పత్రికల సంఘం నాయకులు హుస్సేన్ ఖాన్ లు ఉన్నారు.


# దొర్నిపాడు మండలంలో సజావుగా యూరియా పంపిణీ



**దొర్నిపాడు డిసెంబర్ 9 పల్లె వెలుగు న్యూస్**

దొర్నిపాడు మండలంలోని కొండాపురం, చాకరాజు వేముల దొర్నిపాడు, బురారెడ్డిపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారిని ప్రమీల ఆధ్వర్యంలో యూరియా పంపిణీ నీ వ్యవసాయ సిబ్బంది చేసినట్లు ఏవో తెలిపారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూరైతు భరోసా కేంద్రాల నుండి ఒక్కొక్క గ్రామంలో 532 యూరియా బస్తాల చొప్పున నాలుగు గ్రామాలలో 2128 బస్తాలు రైతులకు అందజేసినట్లు ఆమె తెలిపారు, ప్రతి రైతుకు అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

# ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై పార్లమెంటరీ స్థాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



**పల్లె వెలుగు న్యూఢిల్లీ**

న్యూ ఢిల్లీలోనీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హెల్త్ అండ్ పార్లమెంట్ హౌస్ అనెక్స్ ఎక్స్ టెన్షన్ భవనంలో మంగళవారం మధ్యాహ్నం ఆరోగ్యం, కుటుంబ సంక్షేంపై పార్లమెంటరీ స్థాండింగ్ కమిటీ సమావేశంలో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఆరోగ్య పరిశోధనశాఖ యొక్క 2025-25 డెట్‌మాండ్స్ ఫర్ గ్రాంట్స్ (డిమాండ్ నం. 47) 164 నివేదికలో ఉన్న సిఫార్సులు, పరిశీలనలపై గవర్నర్లు తీసుకున్న చర్యలపై నివేదిక, 170 కేరిట్ సిఫార్సులపై ప్రభుత్వం తీసుకున్న చర్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ యొక్క 163 డిమాండ్ల గ్రాంట్స్ నివేదిక 2025-26 (డిమాండ్ నం. 46)లో ఉన్న పరిశీలన చేయడం జరిగిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై శాఖ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, సభ్యులు పాల్గొన్నారనీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ యొక్క ఆరోగ్య పరిశోధన విభాగం యొక్క 2025-26 డిమాండ్ల కోసం గ్రాంట్ల 164వ నివేదిక (డిమాండ్ నం. 47)లో ఉన్న సిఫార్సులు/పరిశీలనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై 169వ నివేదిక, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ యొక్క 2025-26 డిమాండ్ల కోసం గ్రాంట్ల 163వ నివేదిక (డిమాండ్ నం. 46)లో ఉన్న సిఫార్సులు, పరిశీలనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై 170వ నివేదికపై చర్చించడం జరిగిందన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు.

**మహానంది, పల్లె వెలుగు**

మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ మంగళ వారం తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, వంటగది, పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న మెనూను ఆమె పరిశీలించారు. మెనూ



ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా.. బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం అందిస్తున్నారా అన్న విషయాలపై ఆరా తీశారు. విద్యాబోధనపై పలు అంశాలను చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్ర పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట ఐసిడిఎస్ సూపర్వైజర్ తోట కవిత పాల్గొన్నారు.

# సిఆర్ఎంటిలకు నవంబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలి

**టీచర్స్ యునైటెడ్ ఫోరం జిల్లా నాయకులు డిమాండ్**

**భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన సిఆర్ఎంటిలు**

**పిల్లలపై ప్రయోగం చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించాలి**



[illegible]

## విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించిన పిఎంపి మహిళా వైద్య విభాగం

కొత్తపల్లె శ్రీ శారద విద్యాపీఠం పాఠశాలలో నిర్వహణ

వివిధ అంశాలపై అవగాహన కల్పించిన మహిళా వైద్యులు మాధవి, సౌజన్య, అనూష, తసూణ, శోభిరత్

**పల్లె వెలుగు నంద్యాల**



[illegible]

# గిరిజనులపై కూటమి ప్రభుత్వం కుట్ర

ఎస్టీల్లో బోయ వాల్మీకులను చేరిస్తే వెనుకబడిన గిరిజనులు చితికిపోవడం ఖాయం

ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజా నాయక్

గిరిజనులు ఉద్యమానికి సంకల్పితం కావాలి..

త్వరలో నంద్యాలలోని భారీ ర్యాలీ

**పల్లె వెలుగు వెలుగోడు**



[illegible]

## జనవరి మూడో వారంలో స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ప్రారంభం

యువత నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా కోర్సులు రూపొందించండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో**



[illegible]

# మిర్చి పంటలో తెగుళ్లపై అత్యవసర చర్యలు ప్రారంభించండి

ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**పల్లె వెలుగు అమరావతి**



[illegible]




## ఓటు హక్కు వినియోగంపై కళాకారుల అవగాహన ప్రదర్శన

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు %-% ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గణపురం మండలం, చెల్పూర్ లో 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై టి.ఎస్.ఎస్. కళాకారులు కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు.కళాజాతల ద్వారా ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో ప్రతి ఓటరు ఓటు హక్కు విజయోగించుకోవాలని సందేశాన్ని అందించారు. ప్రతి అర్హత ఉన్న పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చాలని, ఎన్నికలను నిర్దిష్ట నియమావళి ప్రకారం శాంతియుతంగా,ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టిఎస్ ఎస్ కళాకారులు మైసా ఎర్రన్న, దుప్పటి రవి, ఎండి ఖలీల్ పాషా, కొండపర్తి స్వప్న, కంచర్ల శ్యామల, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలి : జిల్లా కలెక్టర్






**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.మంగళవారం ఐడిఓసి కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో ఐక్యత, ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రతీకగా తెలంగాణ తల్లి నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి వ్యక్తి పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిఎం సూర్య ఘర్ పథకంలో పురోగతి పెంచాలి

**వెండర్ ఎంపిక పూర్తైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.**
**బ్యాంకుల ద్వారా ఆర్థిక సాయం అందించాలి.**
**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంలో నంద్యాల జిల్లాలో అంచనా మేరకు పురోగతి సాధించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిఈలు, ఈఈలతో పీఎం సూర్యఘర్ పథకంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సుధాకర్, ఎల్డిఎం రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాబోయే కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కూడా ఈ అంశంపై ప్రత్యేకంగా సమీక్ష చేసే అవకాశముందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో లక్ష్యానికి అనుగుణంగా పురోగతి సాధించాలన్నారు. వెండర్ ఎంపిక (కమిషన్) పూర్తయిన దరఖాస్తులను ఆగకుండా వెంటనే పూర్తి చేసి, లబ్ధిదారులు ప్రయోజనం పొందేలా చర్యలు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. తక్కువ శాతం పురోగతి కనబరుస్తున్న నంద్యాల, రుద్రవరం, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, ఔకు, సంజామల, బనగానపల్లె (రూరల్), ఆత్మకూరు (రూరల్), శ్రీశైలం, ప్యాపిలి మండలాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ మండలాల్లో శనివారం నాటికి గణనీయమైన పురోగతి సాధించేలా తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆమె ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన రుణ సహాయం బ్యాంకుల ద్వారా సులభంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, బ్యాంకింగ్ వ్యవస్థ పథకం అమలులో పూర్తిగా సహకరించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యాలను అధిగమించేలా విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలన్నారు.



# కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కట్కూరి రాధిక - శ్రీనివాస్ బ్యాట్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

**- అన్ని విధాలా అభివృద్ధి చేసి చూపిస్తా..**
**- రూ.18 కోట్లతో మండల కేంద్రంలో నాలుగు వరుసల బీటీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ అభివృద్ధి పనులు..**

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
గణపురం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కట్కూరి రాధిక - శ్రీనివాస్ బ్యాట్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే, అన్ని విధాలా అభివృద్ధి జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.మంగళవారం గణపురం లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కట్కూరి రాధిక - శ్రీనివాస్ గెలుపు కోసం కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సాయిబాబా ఆలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీగా ర్యాలీగా చేరుకున్నారు. అభ్యర్థి తో కలిసి ప్రచార రథంపై నుండి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ...రూ. 18 కోట్లతో మండల కేంద్రంలో నాలుగు వరుసల బీటీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. రూ. 4.20 కోట్లతో %=ఒదీ% రోడ్డు నుండి చెంచుకాలనీ వరకు బీటీ రోడ్డు, రూ.4 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్డు బీసీ కాలనీ నుండి చెంచు కాలనీ వరకు రోడ్డు, రూ.3 కోట్లతో గణపసముద్రం చెరువు మరమ్మతులు, రూ.3 కోట్లతో గణపసముద్రం చెరువు వద్ద బోటింగ్, రెస్టారెంట్, చిల్డ్రన్ పార్క్ మరియు కోట గుళ్ళు వద్ద పర్యాటక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా, రూ.2.5 కోట్లతో కోటగుళ్ళ నుండి స్మశాన వాటిక వరకు రోడ్డు పనులు, రూ. 2.5 కోట్లతో గణపురం నుండి చెల్పూర్ వరకు బీటీ రోడ్డు రెన్యువల్ పనులు, రూ.1.42 కోట్లతో గణపురం నుండి చెల్పూర్ వయా ధర్మారావుపేట వరకు బీటీ రోడ్డు పనులు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కట్కూరి రాధిక - శ్రీనివాస్ బ్యాట్ గుర్తుకు ఓటేసి గెలిపించండి.. అభివృద్ధి చేస్తానన్నారు.






## అవినీతి నిర్మూలన వాల్ పోస్టర్ ఆవిష్కరణ జిల్లా కలెక్టర్

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
ప్రభుత్వ సేవల్లో పారదర్శకత,నైతికతను పెంపొందించడం ద్వారా అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా అవినీతి నిరోధక శాఖ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవినీతి నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందే ప్రతి పౌరుడు అవినీతి విషయమై జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అవినీతి ఘటనలు గమనించినప్పుడు వెంటనే అవినీతి నిరోధక శాఖకు తెలియచేయాలని సూచించారు. పారదర్శక పరిపాలనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి తాను చేయాల్సిన ప్రభుత్వ సేవలకు లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎసిబి డిఎస్పీ సాంబయ్య, సిఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# బైక్ దొంగ అరెస్టు..

# 42 వాహనాలు స్వాధీనం

- ఆసుపత్రులే అడ్డాగా చోరీలు
- నిందితుడు అనంతపురం జిల్లా వాసి
- వివరాలు వెల్లడించిన కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కర్నూలు నగరంతో పాటు వివిధ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కర్నూలు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సుమారు 42 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు డీఎస్పీ జె.బాబు ప్రసాద్ వెల్లడించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు చేపట్టిన నిఘాలో ఈ భారీ చోరీల గుట్టు రట్టయింది.

**ఆసుపత్రే అసలు టార్గెట్**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల క్రితం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కర్నూలు మూడవ పట్టణ (3వ టౌన్) పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలు హడావిడిగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, వారి వాహనాలపై కన్నేసి చాకచక్యంగా దొంగలించేవాడని విచారణలో తేలింది.

**అనంతపురం వాసి అరెస్ట్**

ఈ కేసులో అనంతపురం జిల్లా కక్కలపల్లికి చెందిన పోతుల జాన్ (29) అనే వ్యక్తిని పోలీసులు అనుమానితుడిగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా, తాను చేసిన దొంగతనాలు బయటపడ్డాయి. నిందితుడు పోతుల జాన్ నుంచి మొత్తం 42 ద్విచక్ర వాహనాలను పోలీసులు రికవరీ చేశారు.
ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన కర్నూలు మూడవ పట్టణ సీఐ శేషయ్య, ఎస్సై ఆశాలత, ఏఎస్సై గిడ్డయ్య, హెడ్ కానిస్టేబుళ్లు వాసు, రంగరావు, కానిస్టేబుళ్లు శేఖర్, నాగరాజు, కిశోర్ తదితరులను డీఎస్పీ అభినందించారు.

# ఆరోగ్యరమైన జీవనం యోగాతోనే సాధ్యం

## డాక్టర్ శ్యామ్యూల్ దేవిడ్ రాజ్



**పోరుమామిళ్ల డిసెంబర్ 9 ( పల్లె వెలుగు)**

నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం - 1 కో ఆర్డినేటర్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కమ్మవారి పల్లెలో పాఠశాలలోని యన్ యస్ యస్ స్పెషల్ క్యాంపు చివరి రోజులో భాగంగా యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా యోగా గురువు చందులూరి బ్రహ్మయ్య హాజరై విద్యార్థులకు యోగాసనాల వలన కలిగే ప్రయోజనాలకు విద్యార్థులకు వివరించి, సూర్య నమస్కారం, ప్రాణాయమ వంటి యోగాసనాలను విద్యార్థులతో చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ దేవిడ్ రాజ్ మాట్లాడుతూ యన్ యన్ యస్ స్పెషల్ క్యాంపులో ఏడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను సామాజిక భాగస్వాములు చేసిన జాతీయ సేవా పథకం విభాగం - 1 ప్రోగ్రాం ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ను మరియు వారికి సహకరించి అధ్యాపక సిబ్బందిని అభినందించారు.కార్యక్రమ అనంతరం కమ్మవారి పల్లె పాఠశాల హెడ్ మాస్టర్ ఈరీ విజయ రావును, యోగా గురు బ్రహ్మయ్యను శాలువాతో సన్మానించారు.. ఈ ముగింపు సమావేశంలో యన్ యస్ యస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లిఖార్జున,వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, డాక్టర్ సులోచన, అధ్యాపక, అధ్యపకేతర సిబ్బంది మరియు యన్ యస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# పటిష్ఠ భద్రత నడుమ గోదాంను పర్యవేక్షిస్తూ ఉండాలి





## జిల్లా కలెక్టర్

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల ఎన్నికల ఈవీఎం గోదాం ను పలు రాజకీయ పార్టీల నాయకులతో కలిసి తనిఖీ చేశారు.గోదాం తనిఖీ అనంతరం లాక్ బుక్ లో సంతకం చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ తనిఖీ లో భాగంగా ఈవియం గోదాం ను తనిఖీ చేయడం జరిగిందని నిరంతరం పటిష్ఠ భద్రత నడుమ గోదాం ను పర్యవేక్షిస్తూ ఉండాలని సిసి కెమరాలను పరిశీలించాలని పేర్కొన్నారు.గోదాములో ఎప్పటికప్పుడు పహారా విధులు, రిజిస్టర్ నమోదు, మరియు సాంకేతిక సదుపాయాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డి.టి అబ్బాస్,రాజకీయ పార్టీల నేతలు,సిబ్బంది పాల్గొన్నారు.



# ఫీజు రీయింబర్స్మెంట్ నిలిపివేతపై ఆదిత్య రెడ్డి ఆగ్రహం

- పేద విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం

**బద్వేల్ డిసెంబర్ 9 : (పల్లె వెలుగు)**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బద్వేలు నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి పత్రిక ప్రకటనలో కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని వేలాది పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందలేక, తరగతులకు హాజరుకాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం విద్యార్థుల స్థితిని పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎనిమిది వేల కోట్లకు పైగా ఉన్న రీయింబర్స్మెంట్ బకాయిలను క్లియర్ చేయలేని ప్రభుత్వం, ఏడాదిన్నర కాలంలో లక్షల కోట్ల అప్పులు చేసి కూడా విద్యార్థుల చదువులపై దృష్టి పెట్టకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.విద్యార్థుల హక్కుల కోసం పోరాడిన వైయస్సార్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్యను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి అవమానమని ఆదిత్య రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కుగా ప్రశ్నించే విద్యార్థి నాయకులను గూండాల్లా చూసి అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనను స్పష్టంగా చూపిస్తోందని మండిపడ్డారు.
పేద కుటుంబాల భవిష్యత్తును బంధించే ఈ నిర్ణయాలు వెంటనే ఉపసంహరించాలి అని డిమాండ్ చేస్తూ, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థి నాయకుడు పానుగంటి చైతన్యను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా తెలంగాణ తల్లి సోనియమ్మ జన్మదిన వేడుకలు

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**



టేకుమట్ల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు కట్ చేసే ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ గౌడ్.మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య.టౌన్ అధ్యక్షులు పెరుమాండ్ల క్రాంతి.జిల్లా నాయకులు తోట గట్టయ్య.దొంతుల శ్రీనివాస్.మండల నాయకులు వంగ నరేష్.ఎలబోయిన రాజేందర్.నవీన్.హరి ఓం.పాల్గొన్నారు.యూత్ నాయకులు రాజేందర్.అజయ్. తదితరులు.పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల మండలం. దమ్మనపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయుటకు.

**పోరుమామిళ్ల డిసెంబర్ 9 (పల్లె వెలుగు)**



వైయస్సార్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి గారు. జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు రాజీవ్ భాషా.మండల ఉపాధ్యక్షులు .చేన్ను రాజశేఖ. వైసిపి నాయకులు . బయన్న రమణారెడ్డి. వెంకటేశ్వర్లు ఎంపీటీసీ. సీతారామిరెడ్డి.బి ఎల్లారెడ్డి. ముని రెడ్డి. లక్కినేని ఓబయ్య (%జీ ఖ) వా% ప్రసాదు.%లా%శ్రీనివాసులు. బతల గురుస్వామి.పి .కృష్ణారెడ్డి. పీరయ్య. శివయ్య. రంగనాయకులు.%జ% శివారెడ్డి.%దీ% గురు శంకర్. బాలుడు.ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి గారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లోని కి .పోయి వారితో అక్కడే రచ్చబండ సమావేశాన్ని ఏర్పాటు చేసి.ప్రజాస్వామ్య పద్ధతిలో పంచాయితీ కమిటీలను. ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగిందని అందులో భాగంగానే వివిధ రకాలైన కమిటీలను వైయస్సార్ పార్టీకి అంకిత భావంతో పనిచేసే కార్యకర్తలను ఎన్నుకొని. మన పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని. గతంలో మాదిరి కాకుండా ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తామని చెప్పడం జరిగిందని.ఈ కూటమి ప్రభుత్వం ఎలక్షన్లకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేదని. అన్ని రంగాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని. విద్యార్థులు. రైతులు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆరోగ్యశ్రీ రాష్ట్రంలో సరిగా పనిచేయడం లేదని. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ఉన్నప్పుడు నవరత్నాల కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరికి అన్ని సంక్షేమ పథకాలను బటన్ నొక్కి లబ్ధిదారుల.వారి అకౌంట్లోనే నేరుగా వేసేవారని. ఈనాడు వ్యాపార రంగం. రియల్ ఎస్టేట్. మరియు బేల్దారులు. కార్పెంటర్ లు . పెయింటర్లు.చేతి వృత్తుల వారికి పనులు లేక అవస్థలు పడుతున్నారని. కావున ప్రజలు ఇప్పుడు మళ్లీ జగన్మోహన్ రెడ్డి గారి ముఖ్యమంత్రి కావాలని గట్టిగా కోరుతున్నారని ఆయన అన్నారు.

# చెల్పూర్ సర్పంచ్ గా కావటి రజిత - రవి కత్తెర గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించండి





## - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కావటి రజిత - రవి కత్తెర గుర్తుకు ఓటేసి సర్పంచ్ గా అత్యధిక మెజారిటీతో గెలిపించండని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.మంగళవారం గణపురం మండలం చెల్పూర్ మేజర్ గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కావటి రజిత - రవి గెలుపు కొరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నికల నిర్వహించారు. ముందుగా చెల్పూర్ బస్టాండ్ సెంటర్ నుండి కాపువాడ(మొరంగడ్డ) మీదుగా రామాలయం సెంటర్ వరకు భారీ ర్యాలీ తీశారు. అభ్యర్థితో కలిసి ఎమ్మెల్యే ప్రచార రథంపై నుండి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. బస్టాండ్ సెంటర్, కాపువాడ మరియు రామాలయం సెంటర్ లో నిర్వహించిన పబ్లిక్ కార్నర్ మీటింగ్ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెల్పూర్ గ్రామాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి తోనే సాధ్యమన్నారు. చెల్పూర్ గ్రామాన్ని జెన్కో మరియు సింగరేణి నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్లతో జెన్కో నిధులతో చెల్పూర్ లో మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులకు కొద్దిరోజుల కిందటే శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. కర్నాలకుంట శివారు భూములను రైతులకు త్వరలోనే పట్టాలను అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.2 కోట్లతో చెల్పూర్ నుండి బొబ్బలోని పల్లి వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.50 లక్షలతో కుందూరుపల్లి నుండి ఎర్ర చెరకు వరకు రోడ్డు నిర్మాణ పనులు, రూ.41 లక్షలతో చెల్పూర్ నుండి కుందూరుపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ పనులు, ఎస్సీ కాలనీలో అంగన్వాడీ భవనం, మహిళా సమాఖ్య భవనము, 1000 క్వార్టర్స్ లో పిరమిడ్ ధ్యాన కేంద్రం, కమ్యూనిటీ హాల్ కు ప్రహరీ గోడ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, శివాలయం, రామాలయం లకు ప్రహరీ గోడ, నల్లకాలువ పూడిక తీత పనులు మరియు 92 ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ ఎన్నికల్లో కావటి రజిత - రవి కత్తెర గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే, రాబోయే రోజుల్లో చెల్పూర్ ను నియోజకవర్గంలోనే మోడల్ విలేజ్ గా చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.





# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం..

## ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ..

**మహానంది, పల్లె వెలుగు**
బాల్య వివాహాలు చెయ్యడం చట్టరీత్యా నేరం అని ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు, బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.ఆత్మకూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ... బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం.. బాలుడికి 21, బాలిక కు 18 సంవత్సరాలు నిండక ముందు పెళ్లి చేయడం నేరమని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత మాట్లాడుతూ.. బాల్యవివాహాలు సామాజికంగా, ఆర్థికంగా, శారీరకంగా, మానసికంగా తీవ్ర దుష్పరిణామాలకు దారితీస్తాయని తెలిపారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల తల్లి%-%శిశు మరణాలు పెరుగుతాయని తెలిపారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలు కూడా ఎక్కువగా తలెత్తుతాయని పేర్కొన్నారు.జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, 18ఏళ్ల లోపు వయసు గల పిల్లల పై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి సునీల్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు నూతన వస్త్రాల పంపిణీ

## నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బాబురావు కుమార్తె వివాహ వార్షికోత్సవ సందర్భంగా



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**
నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బాబురావు కుమార్తె బహుళ , సాయికృష్ణ దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా దివ్యాంగులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.
నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ , సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పుట్టినరోజు,వివాహ వార్షికోత్సవం వంటి శు భ కార్యక్రమాలలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఇది మంచి సత్సంప్రదాయమని,అందరూ అనుసరిస్తే పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు,కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి,కోశాధికారి అమిదేల జనార్ధన్,నూతన వస్త్రాల దాత బాబురావు,బహుళ శ్రీ, సాయికృష్ణ దంపతులు, వారి కుమార్తె వ్యోమిక శర్మ,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య, చంద్రమోహన్, పోసిన సుబ్బారావు,కన్నయ్య,సందీప్, మేడం చంద్రశేఖర్, రామయ్య, దివ్యాంగ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# బాలుడి అదృశ్యం విషాదం ట్రాక్టర్ కిందపడి మృతి

## భయంతో మృతదేహాన్ని ఓసీ త్రీ మట్టిలో దాచిన డ్రైవర్ అరెస్ట్





**భూపాలపల్లి డిసెంబర్ 09 పల్లె వెలుగు ప్రతినిధి:**
గణపురం మండలం ధర్మారావుపేటలో అదృశ్యమైన ఐదేళ్ల బాలుడి ఘటన విషాదాంతమైంది. ఆదివారం సాయంత్రం అదృశ్యమైన బందెల రాకేశ్ (5) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడని పోలీసులు మంగళవారం వెల్లడించారు. భయంతో మృతదేహాన్ని మట్టి డంపింగ్ ప్రదేశంలో దాచిన ట్రాక్టర్ డ్రైవర్ గంపల శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. ధర్మారావుపేటకు చెందిన బందెల రాజు%-%రజిత చిన్న కుమారుడు రాకేశ్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా, కోత పనులకు బయలుదేరిన గంపల శంకర్ అతన్ని మరో బాలుడితో పాటు ట్రాక్టర్‌పై ఎక్కించుకున్నాడు. ట్రాక్టర్ కదులుతుండగా రాకేశ్ ప్రమాదవశాత్తు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిందన్న భయంతో శంకర్, బాలుడి మృతదేహాన్ని గన్నీ సంచీలో చుట్టి సమీపంలోని ఓసీ%-%3 గని మట్టి డంపింగ్ యార్డ్‌లో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా, రాకేశ్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, గ్రామస్తులు శంకర్‌ను ప్రశ్నించగా అతని మాటల్లో పొంతనలేని సమాధానం రావడంతో వెంటనే రాకేశ్ తల్లిదండ్రులు గణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై అశోక్, డ్రైవర్ శంకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అతడు జరిగిన ప్రమాదాన్ని ఒప్పుకున్నాడు. శంకర్ చూపించిన ప్రదేశానికి సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, జేసీబీలతో మట్టిని తవ్వించి బాలుడి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పంచనామా చేసి పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సి.సి శివరామ కృషయ్యకు నివాళులు

## - పోరుమామిళ్లలో ప్రాజెక్ట్ సిబ్బంది సంతాపం



**పోరుమామిళ్ల, డిసెంబర్ 9 ( పల్లె వెలుగు)**

పోరుమామిళ్ల మండలంలో సి.సి.గా విధులు నిర్వహిస్తున్న శివరామ కృషయ్య అకాల మరణం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఈ సందర్భంలో ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులు అర్పించి కుటుంబానికి సానుభూతి తెలిపారు.దహన సంస్కారాల నిమిత్తంగా ప్రాజెక్ట్ తరఫున ఆయన భార్య గురుదేవికి రూ.25,000 నగదు సాయం అందజేశారు. ఈ సహాయాన్ని ప్రాజెక్ట్ పీడీ జి. రాజలక్ష్మి



కుటుంబానికి అందించి, ప్రాజెక్ట్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిపిఎం ధనుంజయ, ఏపీఎం వీరాంజనేయులు, సీసీలు, వీఓఏలు మరియు ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.సిబ్బంది మాట్లాడుతూ"శివరామ కృషయ్య ప్రాజెక్ట్ కోసం అంకితభావంతో పనిచేశారు. ఆయన సేవా ధ్యేయం ఎప్పటికీ మాతో పాటు నిలుస్తుంది," అని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొని శివరామ కృషయ్య సేవలను స్మరించుకున్నారు.

# మహిళ అదృశ్యం

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు డిసెంబర్ 9 :** బండి ఆత్మకూరు కు చెందిన నికిత (19) అనే వివాహిత మహిళ సోమవారం రాత్రి అదృశమైందని ఫిర్యాదు అందిందని ఎస్సై జగన్మోహన్ తెలిపారు. రాత్రి దుకాణానికి టాబ్లెట్లు అని వెళ్లి ఇంటికి రాలేదని తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**కట్నం కోసం హింసిస్తున్నారు**

బండి ఆత్మకూరు కు చెందిన సయ్యద్ ఫర్జానా అనే ఆమెను భర్త అమానుల్లా ఖాన్ తో పాటు అత్త రజియా మామ రసీదు అదనపు కట్నం తీసుకొని రమ్మని వేధిస్తున్నారని ఫిర్యాదు అందింది అని ఎస్సై తెలిపారు. ఫర్జానాను మానసికంగా శారీరకంగా వేధిస్తున్న కారణంగా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ వివరించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీను అమలు చేయాలి..

## బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి..ఏఐఎస్ఎఫ్..



**కోసిగి, డిసెంబర్ - 09 (పల్లెవెలుగు):** మండల కేంద్రంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని మహిళ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కన్వీనర్స్ సంగీత, రేఖ, రాజేశ్వరి, మయూరి, శ్రుతి, నీరజ, రేణుక, శారద మాట్లాడుతూ యువగళం పాదయాత్ర లో కోసిగి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా వెనుకబడిన మండలానికి, బాలికల హాస్టల్, బాలికల జూనియర్ కళాశాల, ఏర్పాటు చేసి మహిళ విద్యార్థులకు అన్ని విధాలుగా విద్య అభివృద్ధి కృషి చేయాలని అన్నారు. ఏపీ మోడల్ స్కూల్ రహదారిని సీసీ రోడ్డు గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున దశల వారి ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.






## ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం..

కోసిగి, డిసెంబర్ - 09 (పల్లెవెలుగు): ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మరియు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సీఐ కోసిగి సర్కిల్ తో కలిసి, ఆర్టీసీ బస్‌స్టాండ్ మరియు పరిసర ప్రాంతాలను సందర్శించాము. ఈ సందర్శనలో భాగంగా పట్టణంలో ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహించి ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించడంతో పాటు, ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించాము.

వాహనదారులు, ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు మరియు పాదచారులతో మాట్లాడి హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, ఓవర్ స్పీడ్ నివారణ, తప్పు దిశలో ప్రయాణం చేయరాదని, పాదచారుల భద్రత, పిల్లల భద్రత వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించాము. అవసరమైన చోట్ల సూచనలు ఇచ్చి, ర్రాంగ్ పార్కింగ్ చేసిన వ్యక్తులకు కౌన్సెలింగ్ చేసి, సురక్షిత రహదారి ప్రయాణం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశాము. మొత్తం కార్యక్రమం శాంతియుతంగా, సమర్థవంతంగా పూర్తయ్యింది.



## ఛలో ఎమ్మిగనూరు..

**కోసిగి, డిసెంబర్ - 09 (పల్లెవెలుగు):** వికలాంగుల ఆత్మ బంధువు ఉద్యమాల పెద్దన్న దళితుల గొంతుక బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జరగబోయే ప్రపంచ వికలాంగుల 66 వ సభ కు ముఖ్యఅతిథులుగా వస్తున్నారు. కాబట్టి మంత్రాలయం నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, పెద్దకడబూర్ మంత్రాలయం మండలాలలోని అన్ని గ్రామాలలో ఉన్నటువంటి విహెచ్ పిఎస్ నాయకులు సభ్యులు మరియు ఎం ఆర్ పి ఎస్ నాయకులు సభ్యులు మరియు అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున 13-12-2025 తేదీ శనివారం ఎమ్మిగనూరులో జరుగు సభను విజయవంతం చేయాలని కోసిగి మండల అధ్యక్షులు సామెల్, రాజు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశము కు ముఖ్యఅతిథులుగా ఎం ఎస్ పి జిల్లా ఉపాధ్యక్షులు దుర్గప్ప, మాదిగ తాలూకా అధ్యక్షులు తాయన్న, అధ్యక్షులు విజయ్ కుమార్ మాదిగ నాయకులు బసవరాజు ఎమ్మార్పీఎస్ తాలూకా నాయకులు దేవన మాదిగ మరియు మండల కార్యదర్శి వందగల్లు నరసయ్య మాదిగ సీనియర్ నాయకులు కోడి ఉరుకుందప్ప మొదలగు వారి ఆధ్వర్యంలో వికలాంగుల సభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సభకు నాయకులు రాజేష్ గోపాల్ నరసప్ప మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు మారెప్ప లోకేష్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ఎల్ఐసి సహకారంతో బీమా సఖి వేడుకలు



**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 9**

మహిళ సాధికారతకు ఎల్ఐసి సహకారం అందిస్తుందని, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్ఐసి లో మహిళా ఏజెంట్ల కోసం బీమా సఖి అనే పేరుతో నియమకాలు జరిగాయని ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పులి నాయక్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సంతోష్ కుమార్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇందిర పేర్కొన్నారు మంగళవారం ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో బీమా సఖి ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా కేంద్రం తీసుకున్న నిర్ణయానికి ఎల్ఐసి పూర్తి సహకారం అందిస్తుంది అన్నారు. ఎల్ఐసి వ్యాపారంలో బీమా షకీలా పాత్ర కూడా సఖి పాత్ర కూడా గణనాయక పెరిగింది అన్నారు. ఇంకా మరింత వ్యాపారం చేసి మహిళా ఏజెంట్లు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సిబ్బంది శ్రీవాణి రఘునాథ్ గౌడ్ గోవర్ధన్ వెంకటేశ్వర్లు ఎల్ఐసి ఏజెంట్లు రాజగోపాల్ శెట్టి అనంత భూరళి వేణుగోపాల్ ఈదున్న గౌడ్ ప్రభాకర్ దేవేంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు





## గొప్పింటి కోడలిగా భర్తకు అన్నింటిలో అండగా ఉంటున్న భారతమ్మకు జన్మదిన శుభాకాంక్షలు

### వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

**ఆదోని పల్లె వెలుగు డిసెంబర్ 9**

జననేత ప్రజల హృదయాలను గెలుచుకున్న ప్రియతమ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సతీమణి భారతి రెడ్డి జన్మదిన వేడుకలను వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులు సమక్షంలో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కోడలిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి భార్యగా, పిల్లలను తీర్చిదిద్దడంలో మంచి తల్లిగా ఆడపడుచులకు అక్కగా, సాక్షి ఎలక్ట్రానిక్ మరియు ప్రింట్ మీడియాను వంటి చేత్తో రాణిస్తున్న జగనన్న అర్ధాంగి వైయస్ భారతి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి విషయంలో ప్రజా సమస్యలను భర్తకు తెలియజేస్తూ ఆంధ్ర రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపించడంలో ఆమె పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో

ఇందిరాగాంధీ నగర్ మల్లికార్జున, వెంకటేశ్వర రెడ్డి, నాని, ముకేశ్, జోన్సన్, జయకృష్ణ, పవన్, చంద్రశేఖర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, ఆనంద రెడ్డి, నాగేష్, మరియు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో పూరి గుడిసె దగ్ధం.



**మహానంది, పల్లె వెలుగు**

మహానందిలోని ఈశ్వర్ నగర్ సుంకులమ్మ గుడి వెనకాల పూరి గుడిసె దగ్ధమైంది. మంగళవారం రాత్రి స్థానికుల వివరాల మేరకు.. నాసరి పొట్టి రాజు అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతంతో మంటలు చెలరేగి పూరి గుడిసె పూర్తిగా కాలిపోయిందన్నారు. గుడిసెలో ఉన్న నిత్యవసర సరుకులు, బట్టలు, కొంత నగదు ఇతర వస్తువులు కాలిపోయాయి అని తెలిపారు. ఆ సమయంలో మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించిన ఫలితం లేదన్నారు. మంటలు చెలరేగి పూరి గుడిసె పూర్తిగా కాలి బూడిదయ్యిందని, దీంతో సర్వం కోల్పోయాడని బాధితుడు వాపోయాడు. కట్టుబట్టలతో బాధిత కుటుంబం బజారు పడిందంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.







# పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి

## ఎస్ సరిత

**నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 9**

నందవరం మండలంలో హోలహర్వి గ్రామంలో పొలం పిలుస్తుంది మరియు భూమాత సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు వ్యవసాయ అధికారి ఎస్, సరిత మాట్లాడుతూ నేల మానవునికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప సహజ సంపద వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ సహజ వనరులైన నేల నీరు గాలి మరియు భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన అధిక దిగుబడును సాధించాలి దీనిలో భాగంగా రైతులు అవగాహనతో పంట కోసిన తర్వాత మిగిలిన పంట అవశేషాలైనా మిగిలిపోయిన మొక్క భాగాలు అనగా వరి చెత్త,పత్తి కట్టే, కందికట్టే, మిరప కట్టే మిగిలిన అవశేషాలు భూసార పరిరక్షణకు మరియు సేంద్రియ వ్యవసాయానికి బాగా ఉపయోగపడతాయి

### పంట అవశేషాలు ను కాల్చటం వలన కలిగే అనార్ధాలు

వాతావరణం కలుషితం అవుతుంది

కాల్చటం వలన విష వాయులైన కార్బన్డయాక్సైడ్,మీథేన్, నైట్రాస్ ఆక్సిడె వలన వాతావరణం లో వేడి పెరుగుతుంది అలాగే భూతాపం పెరుగుతుంది

ఒక టన్ను ఎండు గడ్డి కాల్చటం వలన 3 కేజీల ధూళి,60 కేజీల కార్బన్ మోనాక్సైడ్,1460కేజీ ల కార్బన్డయాక్సైడ్ విడుదల అవుతుయి

కాల్చడం వలన నేల ఉష్ణోగ్రతలు పెరిగి మొక్కలకు ఉపయోగపడే అతి విలువైన బాక్టీరియా మరియు సిలింద్రాలు నాశనం అవుతాయి

నేలలో తేమశాతం తగ్గిపోయి పంట దిగుబడి పైన ప్రభావం పడుతుంది

పంట అవశేషాలను కాల్చడం వలన నేల ఆరోగ్యం దెబ్బతిని భూసారం తగ్గిపోతుంది

### పంట అవశేషాలు సద్వినియోగం వలన లాభాలు

పంట అవశేషాలు నేలలో కలియ దున్నడం వలన విలువైన సేంద్రియ పదార్థం నేలకు అందుతుంది

నేల భౌతిక మరియు రసాయన స్థితిగతులు మెరుగవుతాయి

పోషకాలు లోపలి పొరలోనికి కొట్టుకొని పోకుండా కాపాడుతుంది

నేల ఉదజని సూచికను తటస్థంగా ఉంచుతుంది మరియు క్షార గుణాన్ని తగ్గించవచ్చు

పంట అవశేషాలతో నేలను కప్పి ఉంచడం వలన తేమ శాతం పెరుగుతుంది

నేలలు సేంద్రీయ కర్బనం నత్రజని,భాస్వరం,

పొటాషియం తదితర పోషకాల లభ్యత పెరుగుతుంది

నేలలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతుంది అని తెలియ జేశారు

పొలం పిలుస్తుంది లో భాగంగా మొక్క జొన్న పంట లను పరిశీలించడం జరిగింది కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటం వలన నివారణ చర్యలు తెలియ జేశాం

మొక్క జొన్న లో కత్తెర పురుగు నివారణ చర్యలు

వేసవి దుక్కులు లోతుగా దున్నడం వలన గుడ్లు,కోశ స్థ దశలను భూమి పైకి తెచ్చి సూర్యకాంతితో నశించేలా చేయాలి

పంట మార్పిడి చేయాలి

పొలం చుట్టురా ఆకర్షక పంటలను వేయాలి

లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 4 నుండి 5 వరకు పెట్టాలి

జీవ నియంత్రణ చర్యలలో భాగంగా బావేరియా బసానీయ వంటి బయోపెస్టీసైడ్ ను ఉపయోగించాలి

రసాయనిక చర్యలలో భాగంగా క్లోరోపైరీఫాస్ లేదా క్వినల్ ఫాస్ ఎకరాకు 500ml పిచికారి చేయాలి

ఇమామేక్టిన్ బెంజియేట్ ఎకరాకు 100gm మరియు 1లీటర్ వేపనూనె తో కలిపి పిచికారీ చేయాలి

కార్యక్రమం లో భాగంగా మండలం మీద pm kisan e -kycపెండింగ్ లో ఉన్న 98 రైతులు చేయించుకోవాలి అని తతెలియజేశార

ఈ కార్యక్రమం లో రైతులు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు





# అప్లికేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి

**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 9**

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల మంగలగిరిలోని కేంద్ర కార్యాలయంలో "టెక్ %ఒ% అప్లికేషన్ ఆఫిషియల్ ట్రైనింగ్ మాడ్యూల్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి శిక్షకుడిగా పాల్గొన్నారు. పార్టీకి చెందిన వివిధ ప్రాంతాల మండల అధ్యక్షులు మరియు ప్రధాన కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆధునిక సాంకేతికతను రాజకీయ కార్యకలాపాల్లో ఎలా సమర్థంగా వినియోగించుకోవాలో తెలుసుకున్నారు.మాట్లాడుతూ డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి ఆధునిక రాజకీయాల్లో సాంకేతికత ప్రాధాన్యాన్ని వివరించారు. డేటా నిర్వహణ, ఆన్‌లైన్ కమ్యూనికేషన్, డిజిటల్ అవుట్రీచ్ వంటి అంశాలు ఈ రోజుల్లో రాజకీయ వ్యవస్థలో కీలకమయ్యాయని ఆయన గుర్తుచేశారు. పార్టీ కార్యకర్తలు సామాజిక మాధ్యమాలను, వివిధ సాంకేతిక అప్లికేషన్లను బాధ్యతగా ఉపయోగించి పార్టీ సందేశాన్ని విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా పార్టీ చేపట్టిన కొత్త మొబైల్ అప్లికేషన్ "మైటిడిపి" ని పరిచయం చేశారు. ఈ యాప్‌లో ఉన్న సౌకర్యాలు, దాని వినియోగ విధానం, అలాగే పార్టీ కార్యకలాపాల సమన్వయానికి ఇది ఎలా ఉపయోగపడుతుందో డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నవారికి వివరించారు. యాప్‌ను అన్ని స్థాయి కార్యకర్తలకు చేరువ చేసే దిశగా శిక్షణ అందించారు. డాక్టర్ బీ.వీ. జయనాగేశ్వర్ రెడ్డి పార్టీ కార్యకర్తలు మరింత డిజిటల్ పరిజ్ఞానం సంపాదించాలని సూచించారు. సాంకేతికతను సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా పార్టీ నిర్వహణ మరింత బలపడుతుందని, దాని ప్రభావం విస్తరిస్తుందని తెలిపారు. సాంప్రదాయ రాజకీయ నిర్మాణంతో పాటు ఆధునిక డిజిటల్ సాధనాలను సమన్వయం చేస్తూ పార్టీని సమకాలీన అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నంగా ఈ శిక్షణ నిర్వహించారు

# 16వ వార్డు కమిటీ సభ్యులు సమావేశం





**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 9**

స్థానిక ఉర్దూగర్ ఫంక్షన్ హాల్ ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు 16వ వార్డు కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ వార్డ్ కమిటీ మీటింగ్ కు కే. ఆఫీజ బేగం అధ్యక్షుల సమక్షంలో జరిగింది. వార్డు మీటింగ్ కు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎంవి మహేష్ , పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి .దామ నర్సింలు, తెలుగుదేశం పార్టీ పట్టణ సెక్రెటరీ అబ్దుల్లా కో క్లస్టర్ కామర్తి మహేష్.క్లస్టర్ ఇంఛార్జ్ మాజీ కౌన్సిలర్ దాదా సాహెబ్ .వార్డ్ ప్రధానకార్యదర్శి కేఎండి ఫరూక్. ముఖ్య అతిథిగా పాల్గొని వార్డు సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా 16 వార్డు నందు సిసి రోడ్లు, దోబీ ఘాట్ నందు కల్వర్టు, డ్రైనేజ్ సమస్య వివరించగా, ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు మహేష్ కుమార్ మాట్లాడుతూ వార్డు సమస్యలను ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి కి తెలియజే సి వార్డు సమస్యల పరిష్కరించలా కృషి చేస్తామన్నారు. కార్యకర్తలకు ఆర్థికంగా ఉండేవిధంగా వారికీ ప్రత్యామ్నాయంగా పనులు కనిపించే విధంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ,ఉపాధ్యక్షులు వహాబ్ ,బూత్ కన్వీనర్ రఘు, మైనార్టీ నాయకుడు దాదా కలందర్, అబ్దుల్లా, మహిళా కార్యకర్తలు, షఫీ, మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ మెడికల్ కాలేజెస్ : ఎర్రకోట రాజీవ్ రెడ్డి









**ఎమ్మిగనూరు పల్లె వెలుగు డిసెంబర్ 9**

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో జరిగిన సమావేశంలో, ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే పీపీపీ విధానం వల్ల కలిగే తీవ్ర పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే నిర్వహించారు. నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు బలరాం యాదవ్ మరియు నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు చాంద్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, వారి ఆహ్వానం మేరకు ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి పీపీపీ విధానం అమలులోకి వస్తే మెడికల్ కాలేజీలపై పడే భారం, విద్యార్థులకు పెరిగే ఫీజులు, మధ్యతరగతి%-%పేద విద్యార్థులపై పడే ప్రభావం మరియు భవిష్యత్ అవకాశాలు ఎలా తగ్గిపోతాయో విశదీకరించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించే యత్నంలో ప్రతి సంతకం ఎంత విలువైనదో తెలియజేస్తూ, విద్యార్థులలో చైతన్యం నింపారు. తరువాత విద్యార్థుల నుండి కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతాలలో సంతకాలు తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ వాలంటరీస్ విభాగ అధ్యక్షులు ఎస్కే బాబులాల్, 20వ వార్డు బంగి శ్రీరామ్,రాళ్లదొడ్డి చాంద్ బాషా, అగ్రహారం రాము, దేవేంద్ర, రాజీవ్ రెడ్డి యువ సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# ఆదోని జిల్లా ఏర్పాటు చెయ్యడానికి మద్దతు

## బిజెపి నాయకులు దేశాయ్ గురు రాజ్,,,,, జేఏసీ నాయకులు వినతి,,,,,

**నందవరం పల్లె వెలుగు డిసెంబర్ 9**

నందవరంలోని బిజెపి కార్యలయంలో బిజెపి నేత గురురాజ్ దేశాయ్ కి వినతిపత్రం అందచేసిన అదోని జిల్లా సాధన కమిటి JAC నాయకులు మరియు జిల్లా విద్యాసంఘ నాయకులు.ఈ సందర్భంగా గురురాజ్ దేశాయ్ మాట్లాడుచూ మన ప్రాంతం అభివృద్ధి చెందడానికి ఉన్న ఎకైక మార్గం అదోని జిల్లాగా ప్రకటించటం తప్ప వేరే మార్గంలేదని తెలిపారు. మన ప్రాంతంలో వలసలు నివారించాలన్నా, నిరుద్యోగులకు ఉపాథి అవకాశాలు కల్పించాలన్నా కేంద్రబిందువు అదోని కాబట్టి ఆదోని జిల్లాగా ఏర్పడడానికి అన్ని సదుపాయాలు కలిగి ఉంది కాబట్టి కచ్చితంగా మా సంపూర్ణ మద్దతు అలాగే మా బిజెపి పార్టీ యెక్క మద్దతుకూడా సంపూర్ణగా ఉంటుంది అని తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో ఎల్ ఎల్ సి మాజీ చైర్మన్ రామన్న గౌడ్, ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు ఆఫ్రిది, కృష్ణ, శేఖర్, రఘు, ఉదయ్, ఖాజా, అజిత్, ఆర్యన్, బిజెపి నాయకులు కె శివ, డానియల్ మరియు సొషల్ మీడియ కన్వినర్ దండు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలి.


## మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి..

**మహానంది, పల్లె వెలుగు**

రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడి, వ్యవసాయంలో ఖర్చు తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తమ్మడపల్లె, బొల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ..రైతులు విచక్షణారహితంగా యూరియా ఎరువులు వాడరాదన్నారు.యూరియాకు బదులుగా నానో యూరియా వాడుట ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా నేల, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చు అన్నారు.కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డులు తీసుకోవాలన్నారు.వరిలో పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు, గంధకము కలిగి ఉన్న ఎరువులను

వాడరాదన్నారు.దుక్కిలో భాస్వరం, పొటాష్ ఎరువులు ఖచ్చితముగా వాడాలని సూచించారు.జీవన, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారి మాధవ్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన అధికారులు మంజుల, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.





# ఈ నెల 10వ తేదీ నుంచి ఏపీ టెట్ పరీక్షలు

**– జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు**
**– జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు**
**– డీఆర్ఓ మురళి ఆదేశాలు**

**నరసరావుపేట**

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్) పరీక్షలను నరసరావుపేట జిల్లాలోని ఐదు కేంద్రాల్లో అత్యంత కట్టుదిట్టంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా రెవిన్యూ అధికారి(డీఆర్ఓ) మురళి అధ్యక్షతన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) చంద్రకళతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.పరీక్షలు రెండు సెషన్లలో జరుగనున్నాయి.మొదటి సెషన్ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల చుట్టూ 144 సెక్షన్ కొనసాగేలా చూడాలని, గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఆర్ఓ ఆదేశించారు. అభ్యర్థులకు రవాణా ఇబ్బందులు రాకుండా ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని,ప్రతి కేంద్రంలో వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఆర్ఓ సూచించారు.పరీక్ష సమయంలో విద్యుత్,ఇంటర్నెట్ సౌకర్యాలు అంతరాయం లేకుండా ఉండేలా విద్యుత్,బీఎస్ఎన్ఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నియమిత స్క్వాడ్ అధికారులు కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తూ మాల్ ప్రాక్టీసెస్‌కు అడ్డుకట్ట వేయాలని,పరీక్షలు పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించాలని డీఆర్ఓ మురళి ఆదేశించారు.

### జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాలు

1. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజి, కొటప్పకొండ రోడ్, ఎల్లమండ,నరసరావుపేట
2. ఏఎం రెడ్డి మెమోరియల్ ఇంజినీరింగ్ %ఙ% టెక్నాలజీ కాలేజ్,వినుకొండ రోడ్, పెట్లూరివారిపాలెం
3. ఎంఏఎం మహిళా ఇంజినీరింగ్ కాలేజి, కేసనుపల్లి,నరసరావుపేట మండలం.
4. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజి (ఆటోనమస్ బ్లాక్–4), కొటప్పకొండ రోడ్, ఎల్లమండ
5. తిరుమల ఇంజినీరింగ్ కాలేజి, జొన్నలగడ్డ, నరసరావుపేట మండలం.

ఈ ఏర్పాట్లతో జిల్లాలో ఏపీ టెట్ పరీక్షలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగే అవకాశం ఉంది.

# అవినీతికి చెక్.. 'జీరో ఎర్రర్ రెవెన్యూ సిస్టమ్' ఏర్పాటే లక్ష్యం: మంత్రి అనగాని

**పాస్‌పోర్ట్ కార్యాలయాల మాదిరిగా రిజిస్ట్రేషన్ ఆఫీసుల ఏర్పాటు**

**భూ సమస్యల పరిష్కారం బాధ్యతలు ఇకపై జాయింట్ కలెక్టర్లకు అప్పగింత**

**స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.10,169 కోట్ల ఆదాయ లక్ష్యం**

**గత ప్రభుత్వ తప్పిదాల వల్లే రెవెన్యూ సమస్యలని మంత్రి అనగాని విమర్శ**



రాష్ట్రంలో అవినీతికి ఆస్కారం లేని, పారదర్శకమైన పాలన అందించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలను తీర్చిదిద్ది, 'జీరో ఎర్రర్ రెవెన్యూ సిస్టమ్' ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రూ.10,169 కోట్ల ఆదాయం సాధించాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారని మంత్రి పేర్కొన్నారు. "అవినీతి, అక్రమాలను పూర్తిగా నిర్మూలించేందుకు పాస్‌పోర్ట్ ఆఫీసుల మాదిరిగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలను మార్చాలని సీఎం సూచించారు. వెబ్ ల్యాండ్‌లో చేసే ఏ మార్పు అయినా శాశ్వతంగా ఆన్‌లైన్‌లో నమోదయ్యే వ్యవస్థను అమలు చేస్తున్నాం" అని ఆయన వివరించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్లే రెవెన్యూ సమస్యలు పెరిగాయని అనగాని విమర్శించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతి జిల్లాకు ఒక జాయింట్ కలెక్టర్‌ను బాధ్యునిగా నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. "రాష్ట్రంలోని 26 జిల్లాల్లో భూ సమస్యల పరిష్కార బాధ్యత ఇకపై జాయింట్ కలెక్టర్లదే. 7,600 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేశాం. 22ఏ, ఫ్రీ హోల్డ్ వంటి సమస్యల పరిష్కారానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నాం" అని మంత్రి స్పష్టం చేశారు. పెండింగ్ అంశాలపై చర్చించేందుకు గురువారం మంత్రుల ఉపసంఘం సమావేశం కానుందని ఆయన తెలిపారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; Mahesh Babu
RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugu@gmail.com